


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 3 సంచిక: 269, పేజీలు - 09

సోమవారం, జనవరి 8, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

# కూటమిలో తేలని సీట్ల పంపకాల పంచాయితీ

## - కాంగ్రెస్ ముందు అతి పెద్ద టాస్క్



**"ఛాయ్ తాగడం. సమోసాలు తినడం తప్ప ఆ కూటమి నేతలు చేసేదేమీ లేదు" అని ఆ మధ్య ఓ కీలక నేత ఇండియా కూటమిపై ఇలా సెటైర్లు వేశారు. పొలిటికల్ కామెంట్స్ ఇలానే ఉంటాయని అనుకున్నా నిజంగా జరుగుతోంది అదే కావచ్చు అనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు మరెన్నో నెలల సమయం లేదు. ఇప్పటి నుంచే యాక్టివ్ అయితే తప్ప మోదీ సర్కార్‌ని ఢీకొట్టడం సాధ్యం కాదు. అసలు ఈ పాటికే గ్రౌండ్ అంతా ప్రిపేర్ చేసుకోవాలి. కానీ ప్రతిపక్షాలు మాత్రం ఇంకా "ఏం చేద్దాం" అనే దగ్గరే ఆగిపోయినట్టు కనిపిస్తోంది.**

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** లోక్‌సభ ఎన్నికల్లో కచ్చితంగా తమ ప్రభావం చూపించాలను కుంటున్న పార్టీలన్నీ ఒక్కతాటిపైకి వచ్చాయి సరే మరి తరవాతి సంగతేంటి.? ఇప్పటికి నాలుగైదు సార్లు సమావేశమయ్యారు. కానీ ఇప్పటి వరకూ కూటమి నుంచి అధికారికంగా "ఇదీ మా ప్రణాళిక" అన్న ప్రకటన రాలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తప్ప మిగతా ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించినట్టే కనిపించడం లేదు. కూటమిలో అంతా బాగానే ఉండుంటే ఈ పాటికి సీట్ల షేరింగ్ విషయంలో ఓ స్పష్టత వచ్చుండేది. ఇక్కడే పార్టీల మధ్య విభేదాలు మొదలయ్యాయి. సైద్ధాంతిక విభేదాలున్న తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలు కలవడం అంటే అదో వింతే. అప్పట్లో బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికలు జరిగినప్పుడు ఈ రెండు పార్టీల మధ్య ఎన్ని విభేదాలు తలెత్తాయో తెలియంది కాదు. కానీ కూటమి ఈ రెండు పార్టీలనూ ఒక్క చోటకు చేర్చింది. అది ఆ దశకే పరిమితమైంది. సీట్‌ల పంపకాల విషయంలో చిక్కులు వీడడం లేదు. కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి ఇటీవల బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కాస్త గట్టిగానే విమర్శలు చేశారు. "ఆమె మోదీకి సేవలు చేయడంలోనే సరిపోతున్నట్టుంది" అంటూ మండి పడ్డారు. అసలే ఉప్పు నిప్పు లాంటి పార్టీలు చివరకి వరకూ ఎలా కలిసి ఉంటాయన్న అనుమానాలకు ఈ విభేదాలు మరింత బలం చేకూర్చుతున్నాయి.

### దీదీతో విభేదాలు

ఇక్కడే మరో విషయమూ చెప్పుకోవాలి. "మాపై మీరు జాలి చూపించాల్సిన అవసరం లేదు" అని మమతా బెనర్జీపై కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి నేరుగానే విమర్శలు చేశారు. అంతే కాదు. సొంతగా పోటీ చేసి కూడా గెలిచి చూపిస్తాం అని తేల్చి చెప్పారు. అంటే బెంగాల్‌లో సీట్‌ల పంపకాల్లో తేడాలు వస్తున్నట్టేగా. ఇక్కడొక్కచోటే కాదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లోనూ సీట్‌ల పంపకాల సమస్యని తేల్చడం అంత సులభమేమీ కాదు. మహారాష్ట్ర, బిహార్, యూపీ, వెస్ట్ బెంగాల్,

6లో ▶

# భారతీయుల దెబ్బకు దిగొచ్చిన మాల్దీవులు


## - ముగ్గురు మంత్రులపై సస్పెన్షన్ వేటు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంపై మాల్దీవులకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. భారత్‌పై, భారత ప్రధానిపై, భారత పర్యాటకంపై ఆ దేశ మంత్రులు చేసిన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో పెద్ద ఉద్యమమే జరుగుతోంది. బాయ్‌కాట్ మాల్దీవులు అంటూ ట్వీట్లు, పోస్టులతో సోషల్ మీడియా ఊగిపోతోంది. ఈ క్రమంలోనే మాల్దీవులకు వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్న భారతీయులు తమ టూర్‌లను రద్దు చేసుకుంటున్నారు. దీంతో మాల్దీవుల పర్యాటకానికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతోంది. మరోవైపు భారత్‌పై చేసిన

6లో ▶

# ప్రజాపాలనలో దేవుడి దరఖాస్తు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 'ప్రజాపాలన'.. గత 8 రోజులుగా రాష్ట్రంలో మారుమూల గ్రామాలు, పట్టణాల్లో ఇదే మాట వినిపించేది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే అర్హులకు సంక్షేమ పథకాలు అందించే దిశగా, 6 గ్యారెంటీలు అమలయ్యేలా 'ప్రజాపాలన అభయహస్తం' పేరిట ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. డిసెంబర్ 28 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ ఈ నెల 6 వరకూ 8 రోజుల పాటు సాగింది. గ్రామసభల ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు కోటికి పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే, వీటిని పరిశీలిస్తున్న అధికారులు

6లో ▶

# తెలంగాణలో తగ్గనున్న జిల్లాల సంఖ్య.?

## - జిల్లాల పునర్విభజనపై రిటైర్డ్ జడ్జితో కమిషన్

## - సీఎం రేవంత్ రెడ్డి కీలక కామెంట్స్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తెలంగాణ ఆవిర్భావం సమయంలో పది జిల్లాలు ఉండగా పరిపాలన సౌలభ్యం పేరిట వాటి సంఖ్యను 33కు పెంచింది. కొత్త జిల్లాలలతో పాటు రెవెన్యూ డివిజన్లు, మండలాలు కూడా ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం తెలంగాణలో ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగా సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టి నేటికి నెల రోజులు పూర్తవుతుంది. ఈ నెలరోజుల్లో తనదైన మార్కు పాలనతో

6లో ▶

# జగన్ రివర్స్ పాలనలో 30 ఏళ్లు వెనక్కు ఏపీ

## - 'రా కదలిరా' బహిరంగ సభలో చంద్రబాబు





**తిరువూరు (ప్రశ్న న్యూస్)** సీఎం జగన్ దుర్మార్గపు పాలనలో ఏపీ 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఆదివారం నిర్వహించిన 'రా కదలిరా' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ కోలుకోలేని విధంగా దెబ్బతీశారని విమర్శించారు. జగన్ పాలనలో రాష్ట్రంలో నాతో సహా ప్రజలందరూ బాధితులేనని అన్నారు. ఓ పక్క హైదరాబాద్ వెలిగిపోతుంటే ఇక్కడ అమరావతి వెలవెలబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం జగన్ రివర్స్ పాలనే అని ప్రజలు గుర్తించాలని చెప్పారు. 'ఓ వ్యక్తి వల్ల ఓ రాష్ట్రం ఓ తరం ఇంతలా నష్టపోయిన పరిస్థితి ప్రపంచంలోనే ఎక్కడా లేదు. ఓ అసమర్థుడు అధికారంలోకి వస్తే కొంతవరకు, అదే ఓ దుర్మార్గుడికి అధికారం అప్పగిస్తే తిరిగి కోలుకోలేని స్థితిలో నష్టపోతాం. ప్రజాస్వామ్యంలో ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపాను. ఈ అరాచక పాలనకు చరమ గీతం పాడాలి.' అని పిలుపునిచ్చారు.

### అమరావతే రాజధాని

టీడీపీ హయాంలో ఏపీ రాజధానిగా అమరావతిని

6లో ▶

## విజిలెన్స్ ఉద్యోగులకు లక్షల జీతాలు దండగేనా.?

- 8లో

## టౌన్ ప్లానింగ్‌లో అబద్ధాల అధికారులు

### - జిహెచ్ఎంసిలో ఫిర్యాదులపై పూర్తిగా స్పందన కరువు

- 8లో



# ఒకేసారి రెండు పథకాల నిధులు

## - ముహూర్తం ఫిక్స్ చేసిన వైసీపీ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఎన్నికల వేళ సీఎం జగన్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పార్టీ అభ్యర్థుల ఎంపిక కసరత్తు వేగవంతం చేసారు. ఇప్పుడు సంక్షేమ పథకాల అమల్లోనూ వేగం పెంచారు. ఫిబ్రవరి నెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందనే అంచనాలతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. దాదాపు కోటి పది లక్షల మంది

6లో ▶

# సిట్టింగులను మార్చి ఉంటే బాగుండేది

## - ఓటమిపై కేటీఆర్ స్కానింగ్ రిపోర్ట్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిని అధిగమించిన భారత్ రాష్ట్ర సమితి లోక్‌సభ రేసుపై దృష్టి సారించింది. అసెంబ్లీ బరిలో ఎదురైన పరాజయాన్ని ఇక్కడ పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలను తీసుకుంటోంది. లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో సమీక్షా సమావేశాలను నిర్వహిస్తోంది. తెలంగాణ భవన్‌లో జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన పార్టీ ప్రతినిధులతో సమావేశాన్ని

6లో ▶

# నేడు తెలంగాణ మంత్రివర్గం భేటీ

## - నెల రోజుల పాలన, 6 గ్యారెంటీల అమలుపై సమీక్ష



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. నెల రోజుల పాలన, ఆరు గ్యారంటీల అమలుపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. అంతేకాకుండా ప్రజాపాలనలో అందిన ధరఖాస్తులు, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు 2023 డిసెంబర్ 9న కేబినెట్ భేటీ జరిగింది. నేడు రెండోసారి

6లో ▶

## సాహితీ ఇన్‌ఫ్రా రూ.1800

# కోట్ల స్కాం

## - సాహితీ ఇన్ ఫ్రా టెక్ పై 50 కేసులు నమోదు

## - సీసీఎస్ దర్యాప్తు ముమ్మరం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రీలాంచ్ ఆఫర్ల పేరిట వినియోగదారుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడిందన్న అభియోగాలతో సాహితీ ఇన్ ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పై సీసీఎస్

6లో ▶



# కేసీఆర్ ను పరామర్శించిన మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్

## - కేసీఆర్ నివాసానికి వెళ్లిన మాజీ గవర్నర్ దంపతులు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావును తెలంగాణ మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పరామర్శించారు. ఆదివారం మధ్యాహ్నం నరసింహన్, విమల దంపతులు నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లారు. కేసీఆర్ యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ పూర్తి స్థాయిలో కోలుకోవాలని నరసింహన్ ఆకాంక్షించారు. కేసీఆర్ సతీమణి శోభ, కుమారుడు, మాజీ మంత్రి కేటీఆర్‌తో కాసేపు

6లో ▶

## విజయవంతమైన సీఫెల్ కాలనీ ఫెస్ట్ 2024



**మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్)** విభిన్న, వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ సీఫెల్ కాలనీ వాసులు అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సీఫెల్ కాలనీ ఆధ్వర్యంలో కాలనీలో ప్రతీ ఏటా భోగి, గణతంత్ర దినోత్సవం, మహా శివరాత్రి, శ్రీరామ నవమి, స్వాతంత్ర దినోత్సవం, వినాయక చవితి లాంటి పండగలు నిర్వహించడంతోపాటు, 2023 వ సంవత్సరం నుండి, నూతన సంవత్సర మొదటి ఆదివారం నాడు సీఫెల్ కాలనీ ఫెస్ట్ నిర్వహిస్తున్నారు. 2024 సీఫెల్ కాలనీ ఫెస్ట్ ఆదివారం నాడు నిర్వహించారు. ఈ ఫేయిట్లో భాగంగా కాలనీలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. పలువురు వ్యాపారులు, కాలనీ వాసులు పలు రకాల స్టాల్లు ఏర్పాటు చేసారు. ఇందులో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్లు, ఆహార పదార్ధాలు, ఆటలు పలువురిని ఆకట్టుకున్నాయి. కాలనీలో గల అందరు చిన్న, పెద్దా తేడా లేకుండా అందరు ఉత్సాహంగా పాల్గొని ఫెస్ట్ విజయవంతం చేసారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు సీఫెల్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుభాష్ ఇతర కార్యవర్గ సభ్యులను కాలనీ వాసులు అభినందించారు.

## నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ



**కోఠి (ప్రశ్న న్యూస్)** కోఠిలోని డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ జేఏసి క్యాలండర్ ను తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమీషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ జాయింట్ కమీషనర్ డాక్టర్.రమేష్ కుమార్, డాక్టర్.జయరాండెడ్డి, డాక్టర్. మల్లికార్జున్, జేఏసీ చైర్మన్ డాక్టర్ వినయ్ కుమార్ కన్వీనర్ సోమ మల్లన్న కో చైర్మన్లు డాక్టర్ రావుఫ్, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇందిరా శ్రీలక్ష్మి,కో కన్వీనర్లు పరపు కుమార్, వీరేష్ బాబు, పాండు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కిష్టాపూర్ గ్రామంలో ఇంటింటికి అయోధ్య రామయ్య అక్షింతలు



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో ఆదివారం నాడు అయోధ్య రామయ్య అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేశారు శ్రీ సీతారామ ఆలయ ప్రధాన అర్చకులు మణిక్యరావు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి గడపగడపకు మంగళ వాయిద్యాలతో, ఆధ్యాంతం జైశ్రీరామ్, జై జై శ్రీరామ్ నినాదాలతో తిరుగుతూ అక్షింతలను వితరణ చేశారు, అక్షింతలు కలశానికి ప్రతి ఇంటి వద్ద మంగళ హారతి తో స్వాగతం పలికారు, హిందువుల చిలకాల స్వప్నం రామ జన్మభూమి అయోధ్యంలో రాముని ఆలయం ప్రారంభోత్సవం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు, అయోధ్య రాముని అక్షింతలు ప్రతి ఇంటికి అందడం అదృష్టంమని, పూర్వజన్మ సుకృతమని కిష్టాపూర్ గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు, అంతేకాకుండా ఈనెల 22న అయోధ్యలో రాముని యొక్క ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా బాల రాముని ప్రాణ ప్రతిష్ట అనంతరం ప్రజలు తమ ఇళ్లలో పూజ కార్యక్రమాలు నిర్వహించి అక్షింతలు తమ నెత్తిపై చల్లుకోవాలని వారు కోరారు ఆరోజు ప్రతి ఇంటిలో 5 దీపాలు వెలిగించాలని ప్రచారకులు తెలిపారు , ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోదావరి మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేశం గౌడ్ , బిజెపి బూత్ అధ్యక్షులు ఎంచర్ల శేఖర్, వడ్ల చంద్రశేఖర్, నాయకులు నర్సా గౌడ్ , ఏంబరి శేఖర్ , సాదుల దుర్గ ప్రసాద్ , వడ్ల ప్రభాకర్మ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డేటా ఎంట్రీ వారంలోగా పూర్తి చేయాలి

### జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష



జగిత్యాల(ప్రశ్న న్యూస్)ప్రజా పాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ వారంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం రోజున కలెక్టరేట్ లోని డిస్ట్రిక్ట్ మానిటరింగ్ సెల్, మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన డేటా ఎంట్రీ పనితీరును కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ దరఖాస్తు డేటా ఎంట్రీ సూక్ష్మంగా తప్పులు లేకుండా అప్ లోడ్ చేయాలని అన్నారు. జిల్లాలోని 383 గ్రామ పంచాయతీలు, ఐదు మునిసిపల్ 134 వార్డులలో మొత్తం 3,24,532 అభయ హస్తం దరఖాస్తులు రావడం జరిగాయని, వాటన్నిటినీ ప్రభుత్వ ఆదేశాల మేరకు డేటా ఎంట్రీ చేయాలని అన్నారు. డేటా ఎంట్రీ కోసం 542 కంప్యూటర్ లు, ల్యాప్ టాప్ లను సమకూర్చడం జరిగిందని, రెండు షిఫ్ట్ ల వారీగా డేటా ఎంట్రీ కి ఆపరేటర్స్ లను నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నరసింహ మూర్తి, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, మునిసిపల్ ప్రత్యేక అధికారి నరేష్, మునిసిపల్ కమీషనర్ అనీల్ బాబు, జగిత్యాల పట్టణ తహశీల్దార్ వర్ధానం, డివిజనల్ పంచాయతీ అధికారులు కనకదుర్గ, శంకర్, జగిత్యాల గ్రామీణ ఎంపిడిఓ రాజేశ్వరి, హౌసింగ్ డిఈ

# ఫార్మసిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### జి.పి.ఏ కన్వీనర్ నల్ల సోమమల్లన్న



**సుల్తాన్ బజార్ (ప్రశ్న న్యూస్)** వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న పార్మసిస్ట్ లకు సముచిత స్థానం కల్పించాలని గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్ సోమమల్లన్న కోరారు. కోఠిలోని డైరెక్టర్ పబ్లిక్ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ క్యాంపస్ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అథితిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో పార్మసిస్టులు పెక్కు సమస్యలతో సతమతమవుచున్నారని, వెంటనే తెలంగాణ వైద్య విధానం పరిషత్ ను రద్దు చేసి జీతభత్యాలను ట్రెజరీర ద్వార ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ గా ప్రకటించాలని డిమాండ్ చేసారు. అలాగే ఫార్మసిస్టులక త్వరలోనే పదోన్నతులను చేపట్టి వెంటనే పీఆర్సీని అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న డి.ఏ.లను విడదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఇక ప్రతి ఆస్పత్రిలో రెండు ఫార్మసిస్టు పోస్టులు మంజూరు చేయాలని, అలాగే ప్రతి ఏరియా ఆస్పత్రిలో ఒక ఫార్మాసి సూపర్వైజర్ పోస్టుతోపాటు రెండు ఫార్మసిస్ట్ గ్రేడ్ వన్, మూడు ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ప్రతి డి.ఎం.ఎచ్.ఓ కార్యాలయంలో ఒక సూపర్ ఫార్మసీ సూపర్ వైజర్ పోస్ట్ మంజూరు చేయాలని, ప్రతి మల్టీజోన్ కు మూడు చీఫ్ ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టులు మంజూరు చేస్తు ఫార్మసిస్ట్ పోస్టులను ఫార్మసీ ఆఫీసర్ గా మార్చాలని కోరారు గత ప్రభుత్వం డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని చాలా ఆస్పత్రులను అప్ గ్రేడ్ చేస్తు వైద్య విధాన పరిషత్ లోకి మార్చినను నేటి వరకు క్యాడర్ స్ట్రెంత్ మంజూరు చేయలేదని, త్వరలోనే క్యాడర్ స్ట్రెంత్ మంజూరు చేయాలని ఈ ప్రభుత్వాన్ని కోరారు. సమావేశం అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు

### ప్రభుత్వ పార్మసిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ నూతన కార్యవర్గం

గవర్నమెంట్ పార్మసిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా సోమ మలన్న అధ్యక్షులుగా కే శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా శ్యామ్ వడ్డేరాజ్, కార్యదర్శిగా సురేష్, ట్రెజరర్ గా శిరీష , ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వీరేష్ బాబు, సలహాదారులుగా పరాబ్ కుమార్, పాండు, కవిత, వైస్ ప్రెసిడెంట్ గా

కే. రామచంద్రుడు, రామచంద్రరావు, టి సునీత, హయగ్రీవ చారి, బుజ్జి, అరుణ్ కుమార్, పబ్లిక్ సెక్రెటరీగా అలీ జాయింట్ సెక్రెటరీలుగా కే నాగరాజు, పి స్వర్ణలత, మహేష్, ప్రీతి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

### పీర్జాదిగూడలో కౌడిన్య (గౌడ) సంక్షేమ సంఘం

# క్యాలెండర్ ఆవిష్కరణ





**పీర్జాదిగూడ(ప్రశ్న న్యూస్)** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ డిపో పరిదిలో ఆదివారం కౌండిన్య (గౌడ) సంక్షేమ సంఘం అధ్యక్షులు వేముల నాదం గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆర్ నాగభూషణం గౌడ్ ల ఆధ్వర్యంలో కౌండిన్య (గౌడ) సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ 2024 ను ఆదివారం మధ్యాహ్నం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ , బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్, బోడుప్పల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరం 2024 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గౌడ సంఘం అభ్యున్నతికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. గౌడ సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, వారికి సహకారం అందజేస్తామన్నారు. సమిష్టిగా పనిచేస్తూ, సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన పేద మధ్యతరగతి గౌడ్స్ సంఘం కోసం ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్ గౌడ్, గూడూర్ ఎంపీటీసీ శేఖర్ గౌడ్, కౌండిన్య గౌడ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు లోడే చంద్రయ్య గౌడ్, ఉపాధ్యక్షులు పలుసం శంకర్ గౌడ్, సహాయ కార్యదర్శి కోటి లక్ష్మణ్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఏ విజయ్ కుమార్ గౌడ్, కార్యవర్గ సభ్యులు వి భాస్కర్ గౌడ్, ఎం రమేష్ గౌడ్, వేముల రాజు గౌడ్, ఎం శ్రీనివాస్ గౌడ్, పి విజయ్ కుమార్ గౌడ్, సలహాదారులు పల్లె అమృత గౌడ్, పల్లె మైసయ్య గౌడ్, బత్తిని ముత్యాలు గౌడ్, పల్లే మల్లేష్ గౌడ్, జిల్లా బిక్షపతి గౌడ్, గౌడ సంఘం నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మేడిపల్లి ఆర్ఐ టీమ్ ఆధ్వర్యంలో ఫుల్ మారథాన్







**పీర్జాదిగూడ (ప్రశ్న న్యూస్)** మేడిపల్లి అర్ఐ టీమ్ కోచ్ ప్రభాకర్ అధ్వర్యంలో మొట్టమొదటి సారిగా ఫుల్ మారథాన్ 42.195 కిమి నిర్వహించారు.ఆదివారం ఘట్కేసర్ సర్వీస్ రోడ్డు నుండి హయత్ నగర్ వరకు ఈ మారథాన్ నిర్వహించారు. ఈ మారథాన్ ను ఘట్కేసర్ డిఐ వెంకటేశ్వర్లు ఉదయం ప్రారంభించారు.సుమారు 35 మంది సభ్యులు ఈ మారథాన్ లో పాల్గొన్నారు.ఇందులో రవీందర్ నాయక్ 3 గంటల 50 నిమిషాల్లో పూర్తి చేసి మొదటి స్థానం,మల్లేష్ 4 గంటల 05 నిమిషాల్లో పూర్తిచేసి రెండవ స్థానం, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఇంటలిజెన్స్ విభాగం లో పనిచేస్తున్న దుబ్బ కిషన్ 4గ%శీ%,22 నిమిషాల లో పూర్తి చేసి మూడవ స్థానం దక్కించుకోగా. మిగిలిన సభ్యులు కూడా తమ ఫుల్ మారథాన్ ను పూర్తి చేశారు.ఫుల్ మారథాన్ పూర్తి చేసిన పరుగుపందెంలో రాచకొండ సిపి కార్యాలయంలో పనిచేస్తున్న మరో ఇన్స్పెక్టర్ మగ్బుల్ జాని కూడా ఉన్నారు. మొదటి, రెండవ, మూడవ స్థానంలో వచ్చినటువంటి సభ్యులకు ఘట్కేసర్ ఎస్సై రాములు నాయక్ యొక్క ఆధ్వర్యంలో బహుమతులు ఫీల్డ్,సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. మారథాన్ లో పాల్గొన్న సభ్యులందరికి సర్టిఫికెట్స్ అందించారు. మొదటిసారిగా నిర్వహించిన ఈ ఫుల్ మారథాన్ ప్రతి సంవత్సరం యధావిధిగా కొనసాగిస్తామని నిర్వాహకుడు ప్రభాకర్ తెలిపారు.

# శ్రీశైలం లో రెచ్చిపోతున్న దొంగలు





శ్రీశైలం (ప్రశ్న న్యూస్) శ్రీశైలం క్షేత్రపరిదిలో అర్ధరాత్రి ఓ బట్టల దుకాణంలో దొంగ హల్ చల్ చేసాడు. రాత్రి సమయంలో ఆలయానికి సమీపంలోని సిద్ధిరామప్ప షాపింగ్ కాంప్లెక్స్ దుకాణం నెంబర్ 12 లో అరవింద్ రామ్ రాజ్ అనే బట్టల దుకాణంలో దొంగ డబ్బు దోచుకెళ్లాడు దుకాణం తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి సీసీ కెమెరాల వైర్లను సైతం కట్ చేసి సుమారు లక్షల రూపాయలు నగదు వాటితో పాటు సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ కూడా దొంగ ఎత్తుకెళ్లాడు. ఉదయం దుకాణం తెరవడానికి వచ్చిన యజమాని అరవింద్ షాక్ కు గురై వెంటనే శ్రీశైలం పోలీస్ స్టేషన్ కు పిర్యాదు చేసారు.

దీనితో హుటాహుటిన దొంగతనం జరిగిన ప్రదేశానికి సిఐ దివాకర్ రెడ్డి తన సిబ్బందితో ప్రదేశాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే దొంగతనం జరిగిన దుకాణంలో పగలగొట్టిన తాళాన్ని, సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ ని కూడా దొంగ ఎత్తుకెళ్లడు ఇదిలా ఉంటే దుకాణాదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈమధ్య కాలంలో శ్రీశైలంలో దొంగతనాలు అధికామయ్యాయని పోలీసు నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# సంగారెడ్డి జిల్లాలో విషాదం..
# ఉరేసుకొని ఇంటర్ విద్యార్థిని మృతి



సంగారెడ్డి : జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఫ్యాన్‌కు ఉరేసుకొని ఇంటర్ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాదకర సంఘటన జహీరాబాద్ మండలం రంజోల్ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురుకుల పాఠశాలలో ఇంటర్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న స్వప్న (17) డార్మెంటరీ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. గమనించిన విద్యార్థులు, సిబ్బంది స్వప్నను చికిత్స కోసం జహీరాబాద్ సర్కార్ తవఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి స్వగ్రామం జహీరాబాద్ మండలంలోని తూముకుంటగా గుర్తించారు.

## బెంగాల్‌లో దారుణం
## - తృణమూల్ కాంగ్రెస్ నేత కాల్చివేత



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో దారుణ ఉదంతం వెలుగుచూసింది. తృణమూల్ కాంగ్రెస్ నేత సత్యన్ చౌధురిని ఆదివారం బైక్‌పై వచ్చిన దుండగులు కాల్చిచంపారు. ముర్షిదాబాద్‌కు చెందిన పార్టీ ప్రధాన కార్యదర్శి సత్యన్ చౌధురిపై బెంగాల్‌లోని బహరంపూర్‌లో జరిగిన దాడి కలకలం రేపింది. చౌధురిపై దుండగులు కాల్పులు జరపడంతో స్థానికులు అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడని వైద్యులు ధ్రువీకరించారు. బైక్‌లపై వచ్చిన కొందరు వ్యక్తులు చౌధురిని చుట్టుముట్టి దగ్గరి నుంచి కాల్పులు జరిపారని స్థానిక టీఎంసీ నేత తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గతంలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధురితో సన్నిహితంగా మెలిగిన చౌధురి ఆపై పాలక టీఎంసీలో చేరారు.

## బాలికను ప్రలోభపెట్టి పంపిన మహిళ..
## ముగ్గురు బాలురతోసహా నలుగురు లైంగిక దాడి



న్యూఢిల్లీ: బాలికను ఒక మహిళ ప్రలోభపెట్టింది. టీ అమ్మే వ్యక్తి వద్దకు ఆమెను పంపింది. దీంతో అతడితోపాటు అక్కడ పని చేసే ముగ్గురు బాలురు ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుతో ఆ మహిళతో సహా ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. సదర్ బజార్ ప్రాంతంలో ఒక వ్యక్తి టీ స్టాల్ నడుపుతున్నాడు. చెత్త ఏరుకునే ఒక మహిళ ప్రతి రోజు టీ కోసం అక్కడకు వెళ్లేది. అయితే ఎంజాయ్ చేసేందుకు ఒక అమ్మాయిని ఏర్పాటు చేయాలని జనవరి 1న టీ షాపు యజమాని ఆ మహిళను అడిగాడు. దీని కోసం కొంత డబ్బు కూడా ఇచ్చాడు. అలాగే షాపు భవనంపై టార్పాలిన్‌తో తాత్కాలిక షెల్టర్ కూడా నిర్మించాడు.కాగా, మరునాడు ఆ ప్రాంతంలో చెత్త ఏరుకునే 12 ఏళ్ల బాలికతో ఆ మహిళ పరిచయం పెంచుకుంది. మార్కెట్ వద్ద ఒక భవనంపై చాలా చెత్త ఉందని, వెళ్లి తీసుకోవాలని ఆమెను ప్రలోభపెట్టి పంపింది. అక్కడకు చేరుకున్న బాలికపై టీ షాపు యజమానితోపాటు అతడి వద్ద పని చేసే 12,14, 15 ఏళ్ల వయసున్న ముగ్గురు బాలురు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతామని ఆమెను బెదిరించారు.మరోవైపు వాయువ్య ఢిల్లీలోని ఇంటికి చేరుకున్న బాధిత బాలిక రెండు రోజుల పాటు మౌనంగా ఉంది. జనవరి 5న చెత్త ఏరుకునేందుకు సదర్ బజార్ ప్రాంతానికి వెళ్లింది. అక్కడ తన బంధువైన యువతిని కలిసి జరిగిన దారుణం గురించి చెప్పింది. ఆ యువతి తన తల్లిదండ్రులకు ఈ విషయాన్ని వెల్లడించింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన టీ షాపు యజమానితోపాటు అతడి వద్ద పని చేసే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు చెందిన ముగ్గురు మైనర్ బాలురు, బాలికను ప్రలోభానికి గురి చేసి పంపిన మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నారు.

## తెలకపల్లి ఎస్ఐ వాసు రామ్ నాయక్,
## కానిస్టేబుల్ ఆంజనేయులు సస్పెన్షన్




తెలకపల్లి : నిందితులపై కేసు కాకుండా ఉండాలంటే లంచం ఇవ్వాలని డిమాండ్ చేసిన ఎస్ఐ వాసు రామ్ నాయక్, కానిస్టేబుల్ ఆంజనేయులుపై ఆదివారం సస్పెన్షన్ వేటు పడింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 26న నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని బొపెల్లి సమీపంలో కొందరు పేకాట ఆడుతుండగా విషయం తెలుసుకున్న పోలీసులు 6 మందిని పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. వారిపై కేసు కాకుండా ఉండడానికి ఎస్ఐ నిందితుల నుంచి డబ్బులు డిమాండు చేశాడు అన్న ఆరోపణపై ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌విచారణకు ఆదేశించారు. విచారణలో డబ్బులు తీసుకున్నట్లు తేలడంతో ఎస్ఐ, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.

## జారండ్ కాబోయే సీఎంగా కల్పనా సోరెన్..!
## హేమంత్ సోరెన్ సోదరి కీలక వ్యాఖ్యలు..!




జారండ్ సీఎం హేమంత్ సోరెన్ ఈడీ కేసులను ఎదుర్కొంటున్నారు. కేసుల నేపథ్యంలో ఆయన సీఎం పదవికి రాజీనామా చేయవచ్చనే వార్తలు వస్తున్నాయి. సోరెన్ రాజీనామా చేస్తే ఆయన స్థానంలో భార్య కల్పన సోరెన్ బాధ్యతలు చేపట్టవచ్చని ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో హేమంత్ సోరెన్ సోదరి అంజలి సోరెన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కల్పా సోరెన్ సీఎం కాబోతున్నట్లుగా వస్తున్న వార్తలపై అంజిలి సోరెన్‌ను మీడియా ప్రశ్నించింది.దీనికి ఆమె బదులిస్తూ 'అవసరమైతే ఆమె సీఎం కావొచ్చు. మా పార్టీలో ఇంకా పలువురు నేతలు ఉన్నారు. అయితే, పార్టీ శాసనసభా పక్ష సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు. ఇప్పుడే స్పష్టంగా చెప్పలేం. అవసరమైతే ఆమె సీఎం కావొచ్చు' అని పేర్కొన్నారు. ఇంకా ఆమె మాట్లాడుతూ సోరెన్ ప్రభుత్వం గిరిజన ప్రభుత్వమన్నారు. తాము గిరిజనులం కాబట్టే వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. హేమంత్ సోరెన్ ప్రభుత్వం పనిలో కొనసాగితే ఆదివాసీల ఓట్లు పడవని భయపడుతున్నారని ఆరోపించారు.ఇదిలా ఉండగా.. భూకుంభకోణం కేసులో ప్రశ్నించేందుకు ఈడీ హేమంత్ సోరెన్‌కు ఆరుసార్లు సమన్లు జారీ చేసింది. ఈ క్రమంలో ఆయన విచారణకు హాజరుకావడం లేదు. తాజాగా ఏడోసారి సమన్లు జారీ చేస్తూ.. ఎప్పుడు, ఎక్కడ కలుస్తారో స్వయంగా చెప్పాలని ఈడీ సీఎంను కోరింది. మరో వైపు విచారణకు హాజరుకాకపోవడంతో చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఈడీ న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతున్నది. ఒకవేళ ఆయనను ఈడీ అరెస్టు చేసే కల్పనా సోరెన్‌ను సీఎంగా టాక్ నడుస్తున్నది. అయితే, ఈ చర్చలను హేమంత్ సోరెన్ తోసిపుచ్చారు.

## కుటుంబ వ్యక్తిపై యువకుడు దాడి..
## విమానం దారి మళ్లింపు




టొరంటో: విమానం గాలిలో ఉండగా కుటుంబ వ్యక్తిపై 16 ఏళ్ల యువకుడు దాడి చేశాడు. దీంతో విమాన సిబ్బంది, మిగతా ప్రయాణికులు అతడ్ని అడ్డుకుని నిర్బంధించారు. ఈ సంఘటన నేపథ్యంలో ఆ విమానాన్ని దారి మళ్లించారు. కెనడాలో ఈ సంఘటన జరిగింది. ఎయిర్ కెనడాకు చెందిన 137 విమానం టొరంటో నుంచి కాల్గరీకి బయలుదేరింది. అయితే ఆ విమానం గాలిలో ఉండగా 16 ఏళ్ల యువకుడు వింతగా ప్రవర్తించాడు. ఉన్నట్టుండి కుటుంబానికి చెందిన ఒక వ్యక్తిని దారుణంగా కొట్టాడు. విమాన సిబ్బందితో పాటు మిగతా ప్రయాణికులు వెంటనే స్పందించారు. ఆ యువకుడ్ని అడ్డుకుని నిర్బంధించారు. గాయపడిన వ్యక్తికి చికిత్స అందించారు. కాగా, ఈ సంఘటన నేపథ్యంలో ఆ విమానాన్ని దారి మళ్లించారు. విన్నిపెగ్ రిచర్డ్‌సన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దానిని ల్యాండ్ చేశారు. విమానంలో వింతగా ప్రవర్తించడంతోపాటు కుటుంబానికి చెందిన వ్యక్తిపై దాడి చేసిన యువకుడ్ని పోలీసులకు అప్పగించారు. దీంతో అతడ్ని ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ సంఘటన వల్ల విమానం దారి మళ్లడంతో మూడు గంటలు ఆలస్యంగా గమ్యస్థానానికి చేరింది. ఈ నేపథ్యంలో మిగతా విమాన ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

## షెల్టర్ కోసమే ఆ పులులు ఘర్షణ పడ్డాయి
## - సీసీఎఫ్ శాంతారాం



కుమ్రం భీం ఆసిఫాబాద్ : జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం దారిగాం అటవీ ప్రాంతంలో రెండు పులుల మధ్యలో జరిగిన ఘర్షణలో ఒక పులి మృతి చెందిన ఘటన పై అటవీ అధికారులు విచారణ చేపట్టారు. ఆదివారం ఘటనా స్థలిని పరిశీలించిన అటవీశాఖ ఉన్నతాధికారులు పంచనామా నిర్వహించారు.

నమూనాలను సేకరించి ప్రయోగశాలకి పంపించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీసీఎఫ్ శాంతారం, డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టెబ్రీవాల్ మీడియాకు వెల్లడించారు. రెండు సంవత్సరాల వయసు గల రెండు అడ పులులు ఆవాసం కోసం పడిన ఘర్షణలో ఒక ఆడ పులి తీవ్ర గాయలపాలై మృతి చెందినట్లు ప్రాథమిక నిర్ధారణ వచ్చామని పేర్కొన్నారు. ఈ ఘటన జరిగి 5, 6 రోజులు అవుతున్నట్లుగా తెలిపారు. పశు వైద్యాధికారులు సమక్షంలో పులి మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి ఎన్‌టీసీఏ నిబంధనల ప్రకారం ఖననం చేసినట్లు వివరాలను వెల్లడించారు.

# లోక్‌సభ ఎన్నికలకు..
## సమన్వయకర్తలను నియమించిన ఏఐసీసీ



లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతున్నది. ఇందులో భాగంగా తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఆదివారం సమన్వయకర్తలను ఏఐసీసీ నియమించింది. మహబూబ్‌నగర్, చేవెళ్ల సమన్వయకర్తగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్-సికింద్రాబాద్ సమన్వయకర్తగా మంత్రి భట్టి విక్రమార్క, మల్కాజ్‌గిరి బాధ్యతలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం-మహబూబాబాద్ సమన్వయకర్తగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. వరంగల్‌కు కొండా సురేఖ, ఆదిలాబాద్‌కు సీతక్క, నల్గొండ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాగర్ కర్నూల్ జూపల్లి కృష్ణారావు, మెదక్ దామోదర రాజనర్సింహ, నిజామాబాద్ జీవన్‌రెడ్డి, జహీరాబాద్ సుదర్శన్‌రెడ్డి, పెద్దపల్లి శ్రీధర్‌బాబు, కరీంనగర్ బాధ్యతలను పొన్నం ప్రభాకర్‌కు అప్పగించింది.

## షూ ఫ్యాక్టరీల్లో భారీ అగ్ని ప్రమాదం..
## మంటల్లో దగ్ధమైన రెండు ఫ్యాక్టరీలు.



షూ ఫ్యాక్టరీల్లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పక్కపక్కనే ఉన్న రెండు షూ ఫ్యాక్టరీల నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది.. ఫైరింజన్‌ల సాయంతో మంటలను ఆర్పేశారు. హర్యానా రాష్ట్రంలోని బహదూర్‌గఢ్ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికిగల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని చెప్పారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదన్నారు.

## కష్టపడి పనిచేస్తే బీఆర్ఎస్‌కు 16 పార్లమెంటు
## సీట్లు ఖాయం : పోచారం శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తన శక్తితో గెలవలేదు. మన బలహీనతలే కాంగ్రెస్ పార్టీ విజయానికి కారణమని మాజీ స్పీకర్ ,ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ భవన్‌లో ఆదివారం జహీరాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంఖ్యా పరంగా కాంగ్రెస్ గెలువొచ్చు ..కానీ నైతికంగా బీఆర్ఎస్ గెలిచిందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ కొందరు సొంత అభ్యర్థులనే ఓడించుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో ఎవరు సమర్థులు ఉన్నారని ప్రజలు ఓట్లు వేశారు? కార్యకర్తలది తప్పు కాదు నాయకులుగా మనమే బాధ్యత వహించాలన్నారు. నాయకులు నిత్యం ప్రజల్లోనే ఉండాలన్నారు. బీఆర్ఎస్ కున్న కేడర్ మరే పార్టీ కి లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ సీఎం కానందుకు ప్రజలు బాధపడుతున్నారని, కష్టపడి పనిచేస్తే బీఆర్ఎస్‌కు 16 పార్లమెంటు సీట్లు రావడం కష్టమేమి కాదన్నారు. గ్రూపు తగాదాలకు స్వస్తి పలికి సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు.

## పార్టీ మారుతున్నట్లు వార్తలు..
## ఖండించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలపై వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తాను వైసీపీలోనే ఉన్నానని.. నెల్లూరు ఎంపీగా పోటీచేస్తున్నా అని తెలిపారు. ఎలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. సీఎం జగన్ ఏం చెబితే తాము అది చేస్తామని మంత్రి కాకాణి అన్నారు. వైసీపీపై దుష్ప్రచారం చేయడమే టీడీపీ లక్ష్యమని విమర్శించారు. తమ పార్టీలో ఎలాంటి విబేధాలు లేవని.. ఎవరూ పార్టీని వీడటం లేదని స్పష్టం చేశారు.

## సంగారెడ్డి జిల్లాలో విషాదం.. కూలిన చర్చి శ్లాబ్.. పలువురికి గాయాలు



సంగారెడ్డి : జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న చర్చి శ్లాబ్ కూలి పోవడంతో సుమారు 11 మందికి గాయాలయ్యాయి. బాధితులలో నలుగురికి తీవ్రగాయాలవడంతో వారికి చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. ఈ విషాదకర సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. శిథిలాల్లో మరో నలుగురు చిక్కుకున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గుజరాత్‌లో మొదలైన ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్..



ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సంక్రాంతి పండుగ సందర్భంగా గుజరాత్‌లో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ మొదలైంది. ఏటా జనవరి 7న గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఎప్పటిలాగే గుజరాత్ పర్యాటక శాఖ ఇవాళ కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించింది.గుజరాత్‌లో ఏటా జరిగే ఈ కైట్ ఫెస్టివల్‌కు ఒక చరిత్ర ఉన్నది. అహ్మదాబాద్‌కు చెందిన మాస్టర్ కైట్ మేకర్ రసూల్‌భాయ్ రహీంభాయ్ 1989 జనవరి 7న 500 గాలిపటాల రైలును తయారుచేసి ఎగరవేశాడు. అప్పటి నుంచి ప్రతి ఏడాది జనవరి 7న అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. గుజరాత్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కైట్ ఫెస్టివల్ జరుగుతున్నది. జనవరి 14 వరకు ఈ కైట్ ఫెస్టివల్ కొనసాగనుంది. వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఒకచోట గుమిగూడి పతంగులు ఎగురవేస్తారు. కుటుంబసభ్యులు అంతా ఇళ్లపైకి చేరి కూడా ఈ పతంగుల పండుగ జరుపుకుంటారు. ఇవాళ అహ్మదాబాద్‌లో గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ కూడా పతంగ్‌ను ఎగరవేశారు.

## స్వశక్తితో ఎదగాలనే మహిళల సంకల్పం గొప్పది : గుత్తా సుఖేందర్ రెడ్డి



నల్లగొండ : మహిళలే ఇంటిల్లిపాదికి ఆధారమని, స్వశక్తితో వారు ఎదగాలనే సంకల్పం గొప్పదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. నల్గొండ పట్టణానికి చెందిన మహిళలు జననీ, మాతృశ్రీ సంస్థల్లో టైలరింగ్, బ్యూటీషియన్ ట్రైనింగ్ పొందిన వారికి కుట్టుమిషన్లు , బ్యూటీషియన్ కిట్లను గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ యువ నాయకులు గుత్తా అమిత్ రెడ్డి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ పని చేస్తోందని గుత్తా అమిత్ రెడ్డి అన్నారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే కుటుంబాన్ని ముందుకు నడపగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో కనగల్ జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, స్థానిక కౌన్సిలర్ యామ కవిత, అభిమన్యు శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు యామ దయాకర్, ఐతగొని స్వామి గౌడ్, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర రావు, హరికృష్ణ, ఇంద్రసేనా రెడ్డి, జగన్మోహన్ రావు, పరమేష్ , మాతృశ్రీ, జననీ శిక్షణ సంస్థల ఆర్గనైజర్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కారును ఢీ కొట్టిన డీసీఎం వ్యక్తి మృతి.. ములుగు జిల్లాలో ఘటన



ములుగు : జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. డీసీఎం, కారు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన ములుగుజిల్లా మంగపేట మండలం, కమలాపురం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే%ా% గ్రామంలోని అంబేద్కర్ సెంటర్ మూలమలుపు వద్ద డీసీఎం, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని రామచంద్రుని పేట గ్రామానికి చెందిన పుప్పాల మల్లయ్య (60) అనే వృద్ధుడు మృతి చెందాడు. మరో నలుగురికి గాయాలు కాగా స్థానికులు దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రాజకీయంగా బద్నాం చేసేందుకే బంధుత్వం అంటగడుతున్నారు : వినోద్ కుమార్



కరింనగర్ : ఒక వార్తను ప్రచురించేటప్పుడు అన్ని విధాల వివరాలు తెలుసుకొని ప్రచురించాలని ఇలా తప్పుడు ప్రచారాలు చేయవద్దని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. క్యూ న్యూస్ లో తీన్మార్ మలన్ననా అన్నబిడ్డ స్వప్నకు జెన్‌కోలో అర్హత లేకున్నా సీఎండీ ప్రభాకర్ రావు ఉద్యోగం ఇచ్చారని వార్త ఇచ్చారు. నాకు అన్ననే లేడు ఆ స్వప్న ఎవరోఎమిటో తెలియదు అని పేర్కొన్నారు.వాస్తవాలు తెలుసుకోకుండా వార్తలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. క్రాస్ చెక్ చేసుకొని వార్త ఇవ్వాలి దాన్ని జర్నలిజం అంటారని హితవు పలికారు. బోయినపల్లి ఇంటి పేరు ఉన్నంత మాత్రాన బంధుత్వం ఎలా అంటగడుతారని ప్రశ్నించారు. నేను ఎంపీగా ప్లానింగ్ బోర్డ్ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఏ అధికారికారి పైన అయిన ఒత్తిడి చేశానో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా బద్నాం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆర్థిక నేరగాడు నీరజ్ మోదీ నరేంద్ర మోదీ బంధువులు అవుతారా బీజేపీ సోషల్ మీడియా మిత్రులు గ్రహించాలన్నారు. రాజకీయ పోరాటం ఉండాలి కానీ తప్పుడు ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అమ్మాయికి నాకు సంబంధం ఏమిటి ప్రూ చేయగలరా అని డిమాండ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ రానివ్వండి ఎవరు ఏమి చేశారో చెప్తామన్నారు.

## వైభవంగా కొమురవెల్లి మల్లన్న కల్యాణం



కొమురవెల్లి: భక్తుల కొంగుబంగారం కొమురవెల్లి మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతున్నది. ఉజ్జయిని పీఠాధిపతి సిద్ధలింగ రాజదేశికేంద్ర పర్యవేక్షణలో బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలతో మల్లికార్జునుడి కల్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లకు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు. భక్తుల కోసం హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నది.

## ఢిల్లీలో స్కూళ్లకు మరో ఐదురోజులు శీతాకాల సెలవులు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో స్కూళ్లకు శీతాకాల సెలవులను ప్రభుత్వం మరో ఐదురోజులు పొడిగించింది. చలితీవ్రత తగ్గకపోవడం, చల్లని గాలులు వీస్తుండటంతో నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు సెలవులను ఈ నెల 12 వరకు వరకు పొడిగించినట్లు విద్యాశాఖ మంత్రి అతిశి సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం నుంచి పాఠశాలలు తెరచుకోవాల్సి ఉన్నది. ఢిల్లీలో చలి తీవ్రత అధికంగా ఉన్నది. పొగమంచు కారణంగా విజబిలిటీ చాలా తక్కువగా ఉన్నది. పగటిపూట సూర్యకాంతి చాలా తక్కువగా ఉంటున్నది. దట్టమైన పొగమంచు కారణంగా విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నది. దీంతో శీతాకాలపు సెలవులు పొడిగించాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకున్నది. కాగా, జనవరి 10 వరకు పాఠశాలలు మూసివేయాలని విద్యాశాఖ డైరెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దానిని వెంటనే ఉపసంహరించుకున్నారు. పొరపాటు జరిగిందని, సెలవుల పొడిగింపుపై ఆదివారం తుది నిర్ణయం తీసుకోనున్నామని ప్రకటించిన విషయం తెలిసిందే.

## ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు : ముగ్గురు మంత్రులపై మాల్దీవుల వేటు



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముగ్గురు మంత్రులను మాల్దీవుల ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మాల్దీవుల యువత సాధికారత డిప్యూటీ మంత్రి మరియం షియునా,మంత్రులు మల్షా షరీఫ్, మహ్జూం మజీద్ ఎక్స్ వేదికగా చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. ఈ ఉదంతాన్ని మాల్దీవుల ప్రభుత్వ దృష్టికి భారత్ తీసుకువచ్చింది. ప్రధాని మోదీని ఉద్దేశించి మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలను మాల్దీవుల ప్రభుత్వం ఖండించింది. వారి వ్యాఖ్యలతో ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేసింది.కాగా, మరియం షియునా ప్రధాని లక్షద్వీప్ సందర్శించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన మోదీపై వ్యంగ్యోక్తులకు తెగబడింది. మోదీని విదూషకుడని, తోలుబొమ్మ అంటూ ఎక్స్ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యాఖ్యలు పెనుదుమారం రేపడంతో ఆపై సదరు పోస్ట్‌ను డిలీట్ చేసింది.ప్రధాని లక్షద్వీప్‌లో టూరిజాన్ని ప్రోత్సహించేందుకు సోషల్ మీడియా వేదికగా పలు ఫొటోలు షేర్ చేసిన అనంతరం మరియం షియునా మోదీ లక్ష్యంగా ఈ వ్యాఖ్యలు చేసి ఆపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆయా ట్వీట్‌లను డిలీట్ చేసింది.దీంతో మాల్దీవుల్లో భారత హై కమిషనర్ ఈ అంశాన్ని మహ్మద్ మిజు నేతృత్వంలోని మాలే సర్కార్ దృష్టికి తీసుకువెళ్లారు. మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ సైతం ప్రధాని మోదీపై మరియం షియునా అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆమె అసహ్యమైన పదజాలం వాడారని అన్నారు. మాల్దీవులకు కీలక భాగస్వామ్య దేశాధినేత పట్ల మంత్రి మరియం షియునా తీరు మాల్దీవుల భద్రత, సౌభాగ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని అన్నారు.. మంత్రి వ్యాఖ్యల పట్ల మహ్మద్ మిజు ప్రభుత్వం దూరం పాటించాలని, ఆమె వ్యాఖ్యలు ప్రభుత్వ విధానాన్ని ప్రతిబింబించేవి కాదని భారత్ సర్కార్‌కు స్పష్టం

## దేవుడు పిలిస్తే అయోధ్యకు వెళ్తాం: అఖిలేష్ యాదవ్



ఉత్తప్రదేశ్‌లోని అయోధ్య నగరంలో నూతనంగా నిర్మించిన రామ మందిరం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నెల 22న ఆలయంలో నెలకొల్పబోయే శ్రీరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరుగనుంది. ఈ నెల 15 నుంచి ఆలయ ప్రారంభానికి సంబంధించిన ప్రధాన కార్యక్రమాలు మొదలుకానున్నాయి. ఈ కార్యక్రమం కోసం కేంద్రం ఇప్పటికే పలువురు ఆధ్యాత్మికవేత్తలకు, రాజకీయ ప్రముఖులకు ఆహ్వానాలు పంపింది. దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి, ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీకి కూడా ఆహ్వానాలు అందాయి. కాంగ్రెస్ పార్టీ అయోధ్యకు వెళ్లేందుకు సుముఖంగా ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'కాంగ్రెస్ పార్టీతోపాటు మీరు కూడా అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవానికి హాజరవుతారా..?' అని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌ను మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. 'భగవంతుడు పిలిస్తే ఎవరైనా వెళ్తారు. మాకూ దేవుడి నుంచి పిలుపు వస్తే మేం కూడా వెళ్తాం' అని ఆయన తనదైన శైలిలో సమాధానమిచ్చారు.

## రాంగ్ రూట్‌లో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టిన కారు..



లక్నో: ఎక్స్‌ప్రెస్ వేపై ఒక కారు రాంగ్ రూట్‌లో వేగంగా వెళ్లింది. ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కెమెరాలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ సంఘటన జరిగింది. శనివారం నాలెడ్జ్ పార్క్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నోయిడా–గ్రేటర్ నోయిడా ఎక్స్‌ప్రెస్ వేపై ఫార్చ్యూనర్ ఎస్‌యూవీ వేగంగా తప్పుడు మార్గంలో ప్రయాణించింది. ఈ నేపథ్యంలో ఎదురుగా వచ్చిన ఒక బైక్‌ను ఢీకొట్టింది. ఆ బైక్ నడుపుతున్న వ్యక్తి ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఆ మార్గంలో వెళ్తున్న ఒక కారు డ్యాష్ బోర్డ్‌పై ఉన్న కెమెరాలో ఈ ప్రమాదం సంఘటన రికార్డ్ అయ్యింది. దీంతో ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## కలిసి కూర్చున్నందుకు.. దళిత యువకుడు, ముస్లిం యువతిపై దాడి



బెంగళూరు: పబ్లిక్ ప్లేస్‌లో కలిసి కూర్చొన్నందుకు దళిత యువకుడు, ముస్లిం యువతిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. అంతేగాక వారిని ఒక గదిలో నిర్బంధించి ప్లాస్టిక్ పైపులు, ఇనుప రాడ్లతో కొట్టారు. మొబైల్స్ ఫోన్స్‌తోపాటు వారి వద్ద ఉన్న డబ్బులు తీసుకున్నారు. కర్ణాటకలోని బెళగావిలో ఈ సంఘటన జరిగింది. 18 ఏళ్ల దళిత యువకుడు సచిన్ లమాని, 22 ఏళ్ల ముస్లిం యువతి ముస్కాన్ పటేల్ శనివారం సీఎం యువ నిధి పథకానికి దరఖాస్తు చేసేందుకు ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లారు. భోజన విరామ సమయం కావడంతో ఆ తర్వాత రావాలని అక్కడి సిబ్బంది తెలిపారు. దీంతో వారిద్దరూ బెళగావిలోని కిల్లా సరస్సు వద్దకు చేరుకుని అక్కడ కూర్చొన్నారు. కాగా, కొందరు ఆకతాయిలు సచిన్, ముస్కాన్ వద్దకు వచ్చారు. ఆ మహిళ తన బంధువని సచిన్ చెప్పగా ఇద్దరి పేర్లు అడిగారు. ముస్లిం మహిళతో కలిసి ఉన్న అతడ్ని కొట్టారు. ఆమెతో కలిసి ఎందుకు ఉన్నావంటూ సచిన్‌ను ప్రశ్నించి వేధించారు. ఇంతలో మరో 13 మంది అక్కడకు చేరుకున్నారు. వారిద్దరిని ఒక చోటకు తీసుకెళ్లి గదిలో నిర్బంధించారు. తిట్టడంతోపాటు ప్లాస్టిక్ పైపులు, ఐరన్ రాడ్లతో సచిన్‌ను కొట్టారు. అతడి గొంతు నొక్కారు. ముస్కాన్‌పై కూడా దాడి చేశారు. బలవంతంగా మొబైల్ ఫోన్స్, వారి వద్ద ఉన్న రూ.7,000 నగదు లాక్కున్నారు. శనివారం సాయంత్రం వరకు వారిద్దరిని వేధించారు. ఆ తర్వాత బెదిరించి వారిని విడిచిపెట్టారు.మరోవైపు ఈ సంఘటన తర్వాత సచిన్, ముస్కాన్ స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఆగంతకులు తమను కొట్టి హింసించడంపై ఫిర్యాదు చేశారు. తమ మొబైల్స్‌తోపాటు డబ్బులు దోచుకున్నారని ఆరోపించారు. దీంతో ఎస్సీ, ఎస్టీ చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి 9 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## అత్తతో గొడవ.. పిల్లలకు విషమిచ్చి, ఆత్మహత్య చేసుకున్న మహిళ



లక్నో: అత్తతో గొడవ జరుగడంతో ఒక మహిళ తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చింది. ఆపై ఆత్మహత్యకు పాల్పడింది. ఆ మహిళతోపాటు బాలుడు మరణించగా, బాలిక పరిస్థితి విషమంగా ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గ్యాంగ్‌చౌలి గ్రామానికి చెందిన సరళా దేవి ఆదివారం ఉదయం తన పిల్లలను తిట్టింది. దీంతో అత్త జోక్యం చేసుకోవడంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో సరళ తన ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చింది. ఆ తర్వాత గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.కాగా, ఈ విషయం తెలిసిన సరళ భర్త, గ్రామస్తులు వెంటనే పిల్లలను తొలుత స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు రిఫర్ చేయడంతో కాన్పూర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆరేళ్ల కుమారుడు ఆదర్శ్ మరణించాడు. పదేళ్ల కుమార్తె అన్షిక పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. సరళ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కూటమిలో తేలని సీట్ల పంపకాల పంచాయితీ

పంజాబ్‌లో సీట్ షేరింగ్ విషయంలో చాలా ఆచితూచి వ్యవహరించాలని చూస్తోంది కాంగ్రెస్. అదే సమయంలో స్థానిక పార్టీలకు ఎక్కువ సీట్‌లు ఇచ్చేందుకు మాత్రం ఆసక్తి చూపించడం లేదు. ఈ డబుల్ గేమ్ వల్లే ఈ సమస్య కొలిక్కి రావడం లేదు. యూపీలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలున్నాయి. అందులో కనీస 15-20 సీట్లలో పోటీ చేయాలని చూస్తోంది కాంగ్రెస్. మహారాష్ట్రలో 48 ఉండగా అందులో 16-20 స్థానాల్లో, పశ్చిమ బెంగాల్‌లో 6-10 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. ఇది విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారం మాత్రమే. ఈ లెక్క పెరగొచ్చు కూడా. కానీ తగ్గే అవకాశాలైతే కనిపించడం లేదు. ఆ మాత్రం స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టకపోతే అసలు తాము పోటీ చేసి ఏం లాభం అనే వైఖరితో ఉంది కాంగ్రెస్. కానీ 2019 నాటి ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పార్టీలు కాంగ్రెస్‌కి అన్ని సీట్లు ఇచ్చేందుకు ముందుకు వస్తాయా లేదా అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. యూపీలో మాత్రం సమాజ్‌వాదీ పార్టీతో పెద్దగా విభేదాలైతే లేవు. ఒకవేళ అఖిలేష్ యాదవ్ ఒప్పుకుంటే యూపీలో కాంగ్రెస్‌కి పెద్దగా సవాళ్లు ఏమీ ఎదురుకాకపోవచ్చు. సీట్‌ల పంపకాలూ తొందరగానే పూర్తవుతాయి.

### ఈ రాష్ట్రాల్లోనూ సమస్యలే

కాంగ్రెస్‌కి ఉన్న సమస్యల్లా బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లోనే. బిహార్‌లో ఆర్జేడీ, జేడీయూ లాంటి స్థానిక పార్టీలదే హవా. తమకు బలం ఉన్న నియోజకవర్గాలను వదులుకుని కాంగ్రెస్‌కి ఛాన్స్ ఇస్తాయా అన్నది అంతు తేలని ప్రశ్న. అయినా కాంగ్రెస్ కోసం మేమెందుకు త్యాగం చేయాలన్న ఆలోచన వాళ్లలో వచ్చిందంటే హస్తం పార్టీకి చివరకు నాలుగైదు సీట్ల కన్నా ఎక్కువగా మిగలవు. అక్కడే పోటీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు కాంగ్రెస్ ఒప్పుకోకపోవచ్చు. అటు మహారాష్ట్రలోనూ ఉద్ధవ్ థాక్రే శివసేన పార్టీకి, కాంగ్రెస్‌కి అసలు పొసగడం లేదు. కచ్చితంగా 20 సీట్లలో అయినా పోటీ చేస్తామని శివసేన మొండి పట్టుపడుతోంది. కాంగ్రెస్ కూడా దాదాపుగా అదే కోరుకుంటోంది. కానీ ఎవరి లెక్కలు వాళ్లకుంటాయిగా. పైగా అన్ని స్థానిక పార్టీలూ ఈ లోక్‌సభ ఎన్నికలని చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. తనకు మాలిన ధర్మం ఎందుకన్న ధోరణిలోనే ఆలోచిస్తున్నాయి. పైగా కాంగ్రెస్‌కి సీట్‌లు ఇవ్వాలంటే గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఎంత ఉందో అన్న లెక్కలు తీస్తున్నాయి. ఈ లెక్కల ఆధారంగా చూస్తే కాంగ్రెస్‌కి తక్కువ సీట్‌లే కేటాయించే అవకాశాలున్నాయి. ఖర్గే ఒక్కరే కాస్త ముందు పడి ఈ సీట్‌ల లెక్కల్ని తేల్చేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు కానీ కాంగ్రెస్‌లో మిగతా నేతలెవరూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు.

### ఖర్గే స్ట్రాటెజీ ఏంటి.?

అటు ఆమ్ ఆద్మీ పార్టీతోనూ విభేదాలు పక్కన పెట్టి కలిసి నడవడం అంత సులువేమీ కాదు. పంజాబ్‌లో ప్రస్తుతం ఆప్ ప్రభుత్వమే ఉంది. ఇక్కడ కాంగ్రెస్‌కి మంచి క్యాడర్ ఉంది. అందుకే ఇక్కడ ఎక్కువ సీట్‌లలో పోటీ చేయాలని ఆశ పడుతోంది. కానీ ఇప్పటికే అధికారంలో ఉన్న ఆప్ ఆ అవకాశం ఇస్తుందా అన్నది స్పష్టత లేదు. మరో 15-20 రోజుల్లో అంతా సెటిల్ చేసేస్తాం అని ఖర్గే చాలా ధీమాగా చెబుతున్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఇన్ని సమస్యలు ఎదురవుతుంటే ఖర్గే ఏ కాన్ఫిడెన్స్‌తో అలా చెబుతున్నారన్నది ఆసక్తికర విషయం. అలా అని ఆయనను తక్కువ అంచనా వేయడానికీ వీల్లేదు. కొన్ని చోట్ల తగ్గినా సరే..కూటమిగా నిలబడడం మంచిదనే ఆలోచనలో ఉన్నారేమో. ఎందుకంటే కూటమిలో లుకలుకలు మొదలైతే ముందుగా ఆ అపవాదు మూటగట్టుకోవాల్సింది కాంగ్రెస్ పార్టీయే.

# తెలంగాణలో తగ్గనున్న జిల్లాల సంఖ్య.?

రేవంత్ ముందుకు వెళ్తున్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సమీక్షిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా కొత్త జిల్లాల ఏర్పాటుపై సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు.తెలంగాణలో జిల్లాల విభజన సరిగా జరగలేదనీ అభిప్రాయపడ్డారు. ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన రేవంత్ రెడ్డి జిల్లా విభజనపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ జడ్జితో ఓ కమిషన్ ఏర్పాటు చేసి శాస్త్రీయంగా అధ్యయనం చేస్తామన్నారు.ఈ విషయాన్ని అసెంబ్లీలో కూడా చర్చిస్తామన్నారు. జిల్లాలే కాకుండా రెవెన్యూ డివిజన్లు, మండలాలను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డగోలుగా ఏర్పాటు చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు. అధికారులు కూడా గందరగోళంలో ఉన్నారని అందుకే కమిషన్ ఏర్పాటు చేసి, ఆ రిపోర్టు వచ్చాక ప్రజాభిప్రాయాన్ని కోరతామని అన్నారు. జిల్లాలపై అసెంబ్లీలోనూ చర్చిస్తామన్నారు.'ప్రస్తుతం తెలంగాణలో 33 జిల్లాల పేర్లు చెప్పలేని పరిస్థితి ఉంది. ఒక జిల్లాలో మూడునాలుగు జడ్పీటీసీలు మాత్రమే ఉన్నాయి. జడ్పీ సమావేశం నిర్వహిస్తే ముఖముఖాలు చూసుకోవటం తప్ప మరేమీ ఉండట్లేదు. ఒక ఎంపీ నియోజకవర్గం పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలున్నాయి. అవి కూడా మూడునాలుగు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఆ ఎంపీ ఏదైనా చేయాలంటే ఆ మూడు నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మాట్లాడాల్సి వస్తుంది. జిల్లాలు, మండలాల విభజనపై బడ్జెట్ సమావేశాల్లో చర్చిస్తాం. దీనికోసం సుప్రీంకోర్టు లేదా హైకోర్టు జడ్జితో కమిషన్ వేస్తాం. ప్రజల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకొంటాం.' అని రేవంత్ రెడ్డి అన్నారు. అయితే రేవంత్ తీసుకున్న ఈ నిర్ణయంతో జిల్లాల సంఖ్య తగ్గుతుందనే ప్రచారం జరుగుతోంది. తక్కువ జనాభా జిల్లాలను పాత జిల్లాల్లోనే కలిపేయనున్నట్లు తెలుస్తోంది. కమిటీ ఏర్పాటు తర్వాత వచ్చి నివేదికను భట్టి నిర్ణయం ఉంటుండగా ఒక వేళ జిల్లాలను తగ్గిస్తే వాటి సంఖ్య ఎంత ఉండనుంది. ఏ జిల్లాలను కలిపేసే అవకాశం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది.

# ఒకేసారి రెండు పథకాల నిధులు

మహిళలకు సంబంధించిన రెండు ప్రధాన సంక్షేమ పథకాల నిధుల విడుదలకు ముహూర్తం ఖరారు చేసారు.

### పథకాల అమలు

ఎన్నికల వ్యూహాల్లో భాగంగా సంక్షేమ పథకాల అమలుకు జగన్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నెలలోనే గతంలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ పెన్షన్ రూ 3 వేలకు పెంచి అమలు చేస్తున్నారు. దాదాపు 67 లక్షల మందికి పెంచిన పెన్షన్ అందిస్తున్నారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వంలో నెలకు రూ 1,950 కోట్లు కేవలం పెన్షన్ల కోసం ఖర్చు చేస్తున్నారు. ఇక, ఇదే నెలలో మరో ముఖ్యమైన పథకం అమలుకు ముహూర్తం ఖరారు చేసారు. పొదుపు సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా నాలుగో విడత ఈ నెల 23వ తేదీ నుంచి 31వరకు అమలు ముహూర్తంగా నిర్ణయించారు. వైఎస్సార్ ఆసరా ద్వారా ఇప్పటికే రూ 19,195 కోట్లు అందించారు. మూడు విడతలుగా ఈ నిధులు విడుదల చేసారు.

### ముహూర్తం ఖరారు

వైఎస్సార్ ఆసరా పథకం లబ్దిదారుల సంఖ్య 78.94 లక్షల మంది మహిళలు ఉన్నారు. ఈ ఒక్క ఆసరా పథకం ద్వారా మొత్తం రూ 25,570 కోట్ల మేర లబ్ది అందుతోంది. ఇదే తరహాలో మరో ప్రతిష్ఠాత్మక పథకం వైఎస్సార్ చేయూత అమలుకు తేదీ ఖరారు చేసారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో అట్టడుకు వర్గాల్లో వారికి తోడుగా నిలిచేందుకు ఈ పథకం అమలు చేస్తున్నారు. 45 ఏళ్ల పైబడ్డ ఉన్న మహిళలకు ఏడాదికి రూ.18,750లు అందించారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద రూ 14,129 కోట్లు విడుదల చేసారు. 2639 లక్షల మంది మహిళలు ఈ పథకంలో లబ్దిదారులుగా ఉన్నారు. చివరి విడగా ఫిబ్రవరి 5 నుంచి 14వ తేదీ వరకు అమలు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో అర్హత ఉండీ, ఏ కారణంతో అయినా అందని లబ్దిదారులు ఉంటే వారికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ప్రతీ ఆరు నెలలకు వారికి లబ్ది అందించేలా నిర్ణయం అమలు చేస్తోంది.

### గేమ్ ఛేంజర్

ఈ సారి చేయూత పథకం అమలు సమయంలోనే లబ్దిదారులకు సీఎం జగన్ రాసిన లేఖను అందించనున్నారు. ఈ రెండు నెలల కాలంలో పెన్షన్ల ద్వారా 67 లక్షల మంది అవ్వా తాతలకు అందుతోంది. ఇక, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత ద్వారా దాదాపు కోటి 10 లక్షల మంది మహిళల ఖాతాల్లో వరుసగా నిధులు జమ చేయనున్నారు. తాను అమలు చేసిన సంక్షేమం - సామాజిక న్యాయం తనను గెలిపిస్తుంది అనే నమ్మకంతో జగన్ ఉన్నారు. ఫిబ్రవరిలో మేనిఫెస్టో రూపకల్పనతో పాటుగా ఇక ఎన్నికల ప్రచారం ప్రారంభించాలనేది సీఎం జగన్ వ్యూహంగా కనిపిస్తోంది. కొత్తగా ఖరారు చేస్తున్న అభ్యర్థులు ప్రజల్లోనే ఉండాలని సూచిస్తున్నారు. దీంతో, హోరా హోరీగా మారుతున్న ఎన్నికల ప్రచారం వేళ వరుస సంక్షేమ పథకాల అమలు గేమ్ ఛేంజర్ గా మారనుంది.

# నేడు తెలంగాణ మంత్రివర్గం భేటీ

కేబినెట్ భేటీ కానుంది. మరోవైపు నెల రోజుల పాలనపై సీఎం రేవంత్ ట్వీట్ చేశారు. సంకెళ్లను తెంచి, స్వేచ్ఛను పంచి జనం ఆకాంక్షలను నిజం చేస్తూ సాగిన ఈ నెల రోజుల ప్రస్థానం తృప్తినిచ్చిందని రేవంత్ రెడ్డి తెలిపారు. మేము సేవకులమే తప్ప పాలకులం కాదన్న మాట నిలబెట్టుకుంటూ పాలనను ప్రజలకు చేరువ చేస్తామని స్పష్ట చేశారు. నెల రోజుల ప్రయాణం కొత్త అనుభూతినిచ్చిందని చెప్పారు. పెద్దవారికి పిల్లగాడిలాగా చిన్నవారికి రేవంతన్నగా తనను గుండెల్లో పెట్టుకున్న తెలంగాణ గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఇక ముందు తీసుకెళ్తామని వివరించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరుతామని తేల్చి చెప్పారు. అలాగే రైతు రుణ మాఫీకి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. కేసీఆర్ గేమ్ మొదలు పెడితే పోటీ పడాల్సిందేనని అన్నారు. ప్రజాస్వామ్యంగా ముందుకెళ్తాని చెప్పారు. రాష్ట్ర పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేశామని తెలిపారు.

# సిట్టింగులను మార్చి ఉంటే బాగుండేది

ఏర్పాటు చేసింది బీఆర్ఎస్. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దీనికి సారథ్యాన్ని వహించారు. మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మధుసూధనా చారి, ఎంపీ బీబీ పాటిల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మొన్నటి తెలంగాణ ఎన్నికల్లో ఎదురైన ఓటమికి ఎవరూ నిరాశ చెందనక్కర్లేదని, మూడింట ఒకవంతు సీట్లను గెలిచామని అన్నారు. జుక్కల్‌లో హన్మంతు షిండే ఓడిపోతారని అస్సలు ఊహించలేదని, 1,100 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారని గుర్తు చేశారు. స్థానికేతరుడైన కాంగ్రెస్ అభ్యర్థి జుక్కల్‌లో గెలిచారని, నారాయణ్ ఖేడ్ నుంచి వచ్చి జుక్కల్‌లో విజయం సాధించారని కేటీఆర్ పేర్కొన్నారు. నిజాం సాగర్ మండలం మొత్తానికీ దళిత బంధు నిధులను మంజూరు చేశామని, అయినప్పటికీ మిగిలిన వర్గాలు ఓట్లు పార్టీకి పడలేదని విశ్లేషించారు. ఒకరికి సాయం అందితే మరొకరు ఈర్ష్య పడుతున్నారని, సమాజం అలా తయారైందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన వారు కూడా ఇప్పుడు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఓటమి చవి చూసినా ప్రజల్లో కేసీఆర్ పట్ల అభిమానం ఏ మాత్రం చెక్కు చెదర లేదని అన్నారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అనే పదాన్ని సైతం ఉచ్ఛరించడానికి ఇష్టపడేది కాదని, దాన్ని నిషేధించిందని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ కోసం కొట్లాడింది, కొట్లాడేది కూడా బీఆర్ఎస్ మాత్రమేనని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ బలంగా లేకపోతే మళ్లీ తెలంగాణ అనే పదం మాయమౌతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. నెల రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అప్రతిష్ఠను మూటగట్టుకుందని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అప్పుడే ప్రజల నుంచి నిరసనలు మొదలయ్యాయని కేటీఆర్ చెప్పారు. అప్పులను బూచిగా చూపించి హామీల నుంచి తప్పించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ ధ్వజమెత్తారు.లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్- కాంగ్రెస్- బీజేపీ మధ్య త్రిముఖ పోటీ ఉండబోతోందని కేటీఆర్ పేర్కొన్నారు. పరిస్థితులు తమకే అనుకూలంగా ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పట్ల సానుభూతి, కాంగ్రెస్‌కు దూరమైన సామాజిక వర్గాలు ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ విజయానికి బాటలు వేస్తాయని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చి ఉంటే బాగుండేదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అలాంటి పొరపాటు లోక్‌సభ ఎన్నికల్లో జరగనివ్వబోమని తేల్చి చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన వాళ్లు ఇపుడు పునరాలోచనలో పడ్డారని, అధికార పార్టీ ఇచ్చిన బూటకపు హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. జిల్లాల సంఖ్య తగ్గించడానికి ప్రత్యేకంగా కమిషన్‌ను వేస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారని, కొత్త జిల్లాలను రద్దు చేస్తే ప్రజలు ఊరుకోరని కేటీఆర్ హెచ్చరించారు. ఇలాంటి తిరోగమన చర్యలపై ప్రజల్లో పోరాడాలని అన్నారు. తెలంగాణ పురోగమనాన్ని అడ్డుకునే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలను అడ్డుకుందామని పిలుపునిచ్చారు.

# భారతీయుల దెబ్బకు దిగొచ్చిన మాల్దీవులు

వ్యాఖ్యలకు మాల్దీవులకు ఒత్తిడి పెరుగుతుండటంతో ఎట్టకేలకు అక్కడి ప్రభుత్వం స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ముగ్గురు మంత్రులను సస్పెండ్ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీతో పాటుగా భారతీయులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముగ్గురు మంత్రులను సస్పెండ్ చేసిన విషయాన్ని మాల్దీవుల అధికార ప్రతినిధి ఇబ్రహీం ఖలీల్ తాజాగా వెల్లడించారు. షియూనా, మాల్షా, హసన్ జిహాన్ అనే ముగ్గురు మంత్రులపై వేటు వేసినట్లు వివరించారు. షియూనా, మాల్షా, హసన్ జిహాన్ సోషల్ మీడియాలో నరేంద్ర మోదీతో పాటుగా భారత్ లక్ష్యంగా ఇష్టారీతిన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలతో పెద్ద దుమారం రేగడంతో మాల్దీవుల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక మాల్దీవులుకు చెందిన రాజకీయ నాయకులు చేసిన వ్యాఖ్యలకు భారతీయులు సోషల్ మీడియాలో గట్టిగా కౌంటర్ ఇస్తున్నారు. నెటిజన్లతోపాటు సినీ, క్రీడా ప్రముఖులు మాల్దీవుల పట్ల తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. సోషల్ మీడియాలో బాయ్‌కాట్ మాల్దీవులు అంటూ పోస్టులు పెడుతున్నారు. అయితే ఇటీవల లక్షద్వీప్‌లో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి ఫోటోలు వీడియోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. సాహసాలు చేయాలనుకునే వారు తమ లిస్ట్‌లో లక్షద్వీప్‌ను కూడా చేర్చుకోవాలని మోదీ సూచించారు. అయితే దాన్ని తప్పుపడుతూ భారత్‌పై, ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ప్రారంభించారు. ఇక మాల్దీవుల మంత్రి మరియం షియునా మాత్రం ప్రధాని నరేంద్ర మోదీపై అవమానకర వ్యాఖ్యలు చేసింది. ట్విట్టర్ వేదికగా నరేంద్ర మోదీని క్లౌన్ జోకర్, తోలుబొమ్మగా అభివర్ణించడం తీవ్ర వివాదానికి దారి తీసింది.

# ప్రజాపాలనలో దేవుడి దరఖాస్తు

ఓ అప్లికేషన్ చూసి షాకయ్యారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో 'ప్రజాపాలన'లో శివుడి పేరిట దరఖాస్తు రావడంతో అధికారులు నివ్వెరపోయారు. గ్రామానికి చెందిన ఏనుగు రవీందర్ రెడ్డి దేవుడు 'శివుడి' పేరుతో పథకాలకు దరఖాస్తు చేసుకున్నారు. అందులో దరఖాస్తుదారు పేరు శివుడు, భార్య పేరు పార్వతి, కుమారుల పేర్లు వినాయకుడు, కుమారస్వామి అని నింపారు. గృహలక్ష్మి, రైతుబంధు, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళు కోసం అప్లై చేసుకున్నారు. అయితే, అంతకన్నా విచిత్రం ఏంటంటే ఈ అప్లికేషన్ కు సిబ్బంది రశీదు కూడా ఇచ్చారు. ప్రస్తుతం ఈ అప్లికేషన్ ఫారం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తూ కామెంట్స్ చేస్తున్నారు.

# జగన్ రివర్స్ పాలనలో 30 ఏళ్లు వెనక్కు ఏపీ

ప్రకటించినప్పుడు, సీఎం జగన్ మద్దతు పలికారని ఇప్పుడు 3 రాజధానులంటూ మాట మార్చారని చంద్రబాబు దుయ్యబట్టారు. స్వయంగా ప్రధాని మోదీ వచ్చి అమరావతికి ఫౌండేషన్ వేశారని ఇప్పుడు రాజధాని ఏదీ అంటే చెప్పుకోలేని స్థితిలో ఉన్నామని మండిపడ్డారు. రుషికొండను బోడిగుండును చేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాజధానిగా అమరావతే ఉంటుందని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో రైతులు అప్పుల్లో కూరుకుపోయారని అసలు జగన్ కు వ్యవసాయం అంటే ఏంటో తెలుసా.? అని ప్రశ్నించారు. టమాటొకి పొటాటోకి తేడా తెలియని వ్యక్తి మన సీఎం అని ఎద్దేవా చేశారు. ఇలాంటి ముఖ్యమంత్రి నుంచి ప్రజలు ఇంకే ఆశిస్తారని.? అన్నారు. ప్రజలు ఆలోచన చేయాలని సూచించారు.

### మహిళలకు ఫ్రీ బస్ జర్నీ

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలందరికీ 'మహాలక్ష్మి' పథకం కింద నెలకు రూ.1500 అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అలాగే, తల్లికి వందనం కింద రూ.15 వేలు, ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పారు. సంక్షేమ పథకాలకు నాంది పలికింది టీడీపీయేనని సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక వంద పథకాలను రద్దు చేశారని మండిపడ్డారు. 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట' సూపర్ సిక్స్ అందిస్తామని అన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేల భృతి అందిస్తామని ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. 'జయహో బీసీ' కింద ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. 'అన్నదాత' కింద రైతులకు రూ.20 వేలు అందజేస్తామన్నారు. త్వరలోనే టీడీపీ - జనసేన ఆధ్వర్యంలో ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తామని చెప్పారు.

### వైసీపీ ఇంఛార్జీల మార్పుపై

ఇటీవల వైసీపీ ఇంచార్జీల మార్పుపై చంద్రబాబు విమర్శలు గుప్పించారు. 'సొంత పార్టీ ఎమ్మెల్యేలను సీఎం జగన్ నమ్మడం లేదు. ఆయన్ను ప్రజలు నమ్మడం లేదు.' అంటూ ఎద్దేవా చేశారు. గతంలో ఎమ్మెల్యేలను బదిలీ చేసిన సందర్భాలు లేవని గుర్తు చేశారు. 'ఎమ్మెల్యేలను మారిస్తే ఓట్లు పడతాయా.? మనింట్లో చెత్త తీసుకెళ్లి పక్కింట్లో వేస్తే అది బంగారం అవుతుందా.?' అని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేసిన వారికి వైసీపీ సీట్లు ఇవ్వడం లేదని అన్నారు. నన్ను, లోకేశ్, పవన్ ను దూషిస్తేనే టికెట్లు ఇస్తున్నారని పేర్కొన్నారు. గుంటూరు ఎంపీ టికెట్ పేరుతో మాజీ క్రికెటర్ అంబటి రాయుడును మోసగించారని, ఆ టికెట్ మరొకరికి ఇవ్వడంతో ఆయన వైసీపీ నుంచి బయటకు వెళ్తున్నట్లు ప్రకటించారని అన్నారు. ఈ విషయాలు ప్రజలు గమనించాలని సూచించారు. టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# కేసీఆర్ ను పరామర్శించిన మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్

ఇష్టాగోష్టిగా మాట్లాడారు.తమ నివాసానికి వచ్చిన అతిథులను కేసీఆర్ దంపతులు ఘనంగా సత్కరించారు. వారికి పట్టువస్త్రాలు సమర్పించి సంప్రదాయ పద్ధతిలో అతిథి మర్యాదలు చేసారు. కేసీఆర్ దంపతులు చూయించిన ప్రేమాభిమానాలకు నరసింహన్ దంపతులు అభినందనలు తెలిపారు. అంతకుముందు నందినగర్ నివాసానికి చేరుకున్న నరసింహన్, విమల దంపతులకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు పుష్పగుచ్ఛం ఇచ్చి సాదర స్వాగతం పలికారు. శాలువా కప్పి సత్కరించారు. దగ్గరుండి వారిని లిఫ్టులో పైఅంతస్తుకు తీసుకెళ్లారు. నాడు కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో జరిగిన అభివృద్ధి గురించి ఈ సందర్భంగా కేసీఆర్, నరసింహన్ మధ్య చర్చకు వచ్చింది. ఈ క్రమంలో గవర్నర్ హోదాలో నాడు నరసింహన్ అందించిన సంపూర్ణ సహకారానికి కేసీఆర్ మరోసారి ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ నివాసంలో మాజీ గవర్నర్ నరసింహన్‌కు స్వాగతం పలికిన వారిలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, బీబీ పాటిల్ తదితరులు ఉన్నారు.

# సాహితీ ఇన్‌ఫ్రా రూ.1800 కోట్ల స్కాం

పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ స్కామ్ మొత్తం రూ.1800 కోట్లుగా పోలీసులు తేల్చారు. ఇప్పటివరకూ సంస్థ ఎండీ లక్ష్మీనారాయణ సహా 22 మందిని అరెస్ట్ చేశారు. ఇప్పటివరకూ 50 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. 2019 - 22 మధ్య పలు ప్రాజెక్టుల పేరుతో కస్టమర్ల నుంచి రూ.504 కోట్లు వసూలు చేసినట్లు గుర్తించారు.

### 9 ప్రాజెక్టుల పేరుతో

సాహితీ ఇన్ ఫ్రా సంస్థ 9 ప్రాజెక్టుల పేరుతో కస్టమర్ల నుంచి రూ.కోట్లు వసూలు చేసింది. నానక్ రాంగూడలో సాహితీ స్వద కమర్షియల్ పేరుతో 69 మంది నుంచి రూ.65 కోట్లు. మేడ్చల్ - కొంపల్లి షిస్టా అబోడ్ పేరుతో 248 మంది నుంచి రూ.79 కోట్లు, కొంపల్లిలో సాహితీ గ్రీన్ పేరుతో 153 మంది నుంచి రూ.40 కోట్లు వసూలు చేసింది. గచ్చిబౌలిలోని సాహితీ సితార పేరుతో 269 మంది వద్ద రూ.135 కోట్లు, బంజారాహిల్స్ లో సాహితీ మహెటో సెంట్రో పేరుతో 44 మంది నుంచి రూ.22 కోట్లు దండుకుంది. నిజాంపేటలో ఆనంద్ ఫార్చ్యూన్ పేరుతో రూ.40.50 కోట్లు, మోకిలాలో సాహితీ సుదీక్ష పేరుతో రూ.22 కోట్లు, బాచుపల్లిలో రూబీకాన్ పేరుతో 43 మంది నుంచి రూ.6.9 కోట్లు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

### ఇదీ జరిగింది

23 ఎకరాల్లో 38 అంతస్తుల అపార్ట్ మెంట్ నిర్మాణం పేరుతో సాహితీ ఇన్ ఫ్రా సంస్థ వినియోగదారుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. డబుల్, ట్రిపుల్ బెడ్‌రూమ్‌ల ఫ్లాట్లు ఉంటాయని నమ్మబలికారు. మంచి ఎమినిటీస్‌తో తక్కువ ధరకే ఇస్తామని అందర్నీ ఆకర్షించారు. అయితే, డబ్బులు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా.. ఎలాంటి ప్రాజెక్టులు మొదలు పెట్టకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ముందే డబ్బులు వసూలు చేశారని మండిపడ్డారు. మరో ప్రాజెక్టులోనూ 2,500 మంది నుంచి రూ.900 కోట్లు వసూలు చేసినట్లు వరుస ఫిర్యాదులు అందాయి. అంతకు ముందు ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని ఆలస్యంగా తెలుసుకున్న కస్టమర్లు.. తమ డబ్బులు తిరిగిచ్చేయాలని సంస్థ ఎండీ లక్ష్మీనారాయణపై ఒత్తిడి తెచ్చారు. ఏడాదికి 15 నుంచి 18 శాతం వడ్డీ ఇస్తానంటూ నమ్మబలికి, కొందరికి చెక్స్ కూడా ఇచ్చారు. కానీ ఆ చెక్స్‌ను బ్యాంకులో వేస్తే బౌన్స్ అయ్యాయి. దీంతో వినియోగదారులంతా తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదులు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారించిన పోలీసులకు విస్తుపోయే విషయాలు తెలిశాయి. ప్రీలాంచ్ పేరుతో మోసాలకు పాల్పడ్డ సంస్థ ఎండీ ఆ డబ్బును వివిధ ప్రాజెక్టుల్లోకి మళ్లించినట్లు గుర్తించారు. నగదును అవసరాలకు వాడుకున్నారని తెలిపారు. దీనిపై ప్రస్తుతం సీసీఎస్ పోలీసుల విచారణ సాగుతోంది.

# విద్యార్థిని మృతి పై న్యాయ విచారణ జరిపించాలి : ఎమ్మెల్యే మాణిక్యరావు




జహీరాబాద్ : సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థి స్వప్న (17 )ఆత్మహత్య చేసుకోవడంతో విద్యార్థిని తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం జహీరాబాద్ మండలంలోని రంజుల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్న స్వప్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. విద్యార్థిని స్వప్న ఫ్యానుకు ఉరివేసుకున్న విషయాన్ని తోటి విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు తెలపడంతో వెంటనే ఫ్యాన్ నుంచి కిందికి దించారు.విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స కోసం జహీరాబాద్ సర్కార్ దవఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విద్యార్థిని మృతి పై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పరిస్థితి విషమంగా మారింది. వివిధ కుల సంఘాలు విద్యార్థినుల తల్లిదండ్రులు భారీ సంఖ్యలో రంజుల్ గురుకుల పాఠశాలకు చేరుకొని విద్యార్థిని మృతిపై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల లోపనికి వెళ్లేందుకు ఎవరికి అనుమతించకపోవడంతో గేటు ముందు ఆందోళనకు దిగారు. దళిత విద్యార్థి మృతి పై న్యాయ విచారణ చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్యరావు డిమాండ్ చేశారు. పాఠశాల లోనికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించకపోవడంతో గేటు ముందు బైఠాయించి విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేసే వరకు కదిలేది లేదని బైఠాయించారు. దీంతో అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో పోలీసులు భారీ సంఖ్యలో చేరుకున్నారు.

# నెల్లూరు జిల్లాలో లారీని ఢీకొట్టిన తెలంగాణ ఆర్టీసీ బస్సు.. ఇద్దరి మృతి

నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం మోచర్ల వద్ద తెలంగాణ ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టిన ఘటనలో డ్రైవర్ సహా మరొకరు మృతి చెందారు. టీఎస్ ఆర్టీసీ బస్సు మిర్యాలగూడ నుంచి తిరుపతికి వెళుతుండగా మోచర్ల వద్ద లారీని బస్సు వెనకనుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. దీంతో డ్రైవర్ వినోద్ (45) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో ఏడుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరు తరలించారు. వీరిలో 65 ఏళ్ల వృద్ధురాలు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మిస్సయిన ఆ 26 మంది అమ్మాయిల గుర్తింపు.. ఇద్దరు అధికారులు సస్పెండ్



భోపాల్ శివారులోని పర్వాలియాలోని ఆంచల్ గర్ల్స్ హాస్టల్ నుంచి కనిపించకుండా పోయిన 26 మంది బాలికలను శనివారం పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (సీడీపీవో) అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మరో ఇద్దరు అధికారులకు నోటీసులు జారీ అయ్యాయి. మిస్సయిన 10 మంది అమ్మాయిలను అదమ్‌పూర్ చావ్ని ప్రాంతంలో గుర్తించగా, 13 మందిని మ్నురికివాడల్లో, ఇద్దరిని టాప్ నగర్‌లో, ఒకరిని రాయ్‌సెన్‌లో గుర్తించారు. చిల్డ్రన్ హోం నుంచి బాలికలు మిస్సయిన విషయం నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) చైర్మన్ ప్రియాంక కనుంగో ఆకస్మిక సందర్శనతో బయటపడింది. 68 మంది బాలికలు ఉండాల్సిన చోట 26 మంది అమ్మాయిలు కనిపించకుండా పోవడాన్ని గుర్తించారు. వీరందరూ గుజరాత్, ఝార?ండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌కు చెందినవారే. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత ఇద్దరు సీడీపీవో అధికారులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

# ఇండస్ట్రీలో ఎక్కువకాలం ఉండాలంటే అలా చేయాల్సిందే : మృణాల్ ఠాకూర్

'సీతారామం'తో తెలుగు తెరపై తళుక్కుమన్నది మరాఠీ ముద్దుగుమ్మ.. మృణాల్ ఠాకూర్! మొదటి సినిమాతోనే.. ఏదో మ్యాజిక్ చేసేసింది. హెవీ లుక్స్ యాక్టింగ్ స్కిల్స్‌తో వరుస ఆఫర్లు దక్కించుకుంటున్నది. దక్షిణాది -త్తరాది తేడా లేకుండా.. రెండు ఇండస్ట్రీలలోనూ దుమ్మురేపుతున్నది. బుల్లితెరపై సీరియళ్లతో కెరీర్ మొదలుపెట్టి.. వెండితెరను ఏలుతున్న ఈ నయా 'యష్ణ'తో మాటాముచ్చట!చిత్ర పరిశ్రమలో ఎక్కువ రోజులు కొనసాగాలంటే.. గ్లామర్ మెయింటెయిన్ చేయాల్సిందే! అందుకోసం అందరిలాగే నేను కూడా బ్యూటీ టిప్స్ ఫాలో అవుతాను! ముఖానికి పసుపు రాసుకుంటా. తాజా పండ్లతో ఫేస్‌ప్యాక్ వేసుకుంటా. ముఖం కాంతిమంతంగా ఉండేందుకు బియ్యం కడిగిన నీళ్లను ముఖంపై స్ప్రే చేసుకుంటా! ఇదో కొరియన్ చిట్కా!'కేన్స్'లో రెడ్ కార్పెట్‌పై నడవడం నటులకు ఒక కల. 2022లో కేన్స్ ఫెస్టివల్ సమయంలో నేను షూటింగ్‌లో ఉన్నా. వచ్చే ఏడాది ఎలాగైనా.. కేన్స్ ఫెస్టివల్‌లో పాల్గొనాలని నాకు నేనే ఒక ప్రామిస్ చేసుకున్నా! అనుకున్నట్టు గానే.. 2023లో కేన్స్‌లో సందడి చేశా!టీవీ నటులకు సినీ పరిశ్రమలో అవకాశాలు చాలా తక్కువగా వస్తుంటాయి! వచ్చినా.. చిన్నచిన్న క్యారెక్టర్లకే అవి పరిమితం. ఇక్కడ నిలదొక్కుకోవడం కూడా కష్టమే! అయితే, ప్రతిభకు అదృష్టం కూడా తోడైతే.. ఎక్కడైనా రాణించవచ్చు. దానికి నేనే మంచి ఉదాహరణ! బుల్లితెర నటీనటులు బాలీవుడ్‌లో రాణించలేరనే అపోహను చెరిపేశా!నాన్నే నా జీవితానికి మూలస్తంభం. ఆయనే నా ఇన్‌స్పిరేషన్. ఈరోజు నేను ఈ స్థాయిలో ఉండటానికి



కారణం.. ఆయన నేర్పించిన విలువలే! చిన్నప్పటి నుంచీ ఒక్కటే చెప్పేవారు.. 'ఎన్ని సమస్యలు ఎదురైనా జీవితాన్ని హాయిగా నవ్వుతూగడపాలి!'. ఆ ఫిలాసఫీని పాటించడం వల్లే.. నేను ఇక్కడిదాకా రాగలిగాను. బుల్లితెరతో ప్రారంభమై వెండితెర వరకూ వచ్చిన ఈ ప్రయాణం.. ఎంతో అందమైంది, అనూహ్యమైంది! ఎన్నో అడ్డంకులు దాటుకొని, స్వయంకృషితో ఇక్కడిదాకా వచ్చా! పరిశ్రమలో ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలి. మంచి సినిమాలు, మంచిమంచి పాత్రలు చేయాలి. ప్రేక్షకులకు నా పేరు గుర్తురాక పోయినా ఫర్వాలేదు. కానీ, నన్ను చూడగానే.. సీత, యష్ణ ఇలా సినిమాల్లో నేను చేసిన పాత్రలు వారి మదిలో మెదిలితే చాలు! అందుకోసం ఎంత కష్టపడటానికైనా నేను సిద్ధమే! రోజులు చాలా బిజీగా గడుస్తున్నాయి. నాకోసం నేనే సమయాన్ని కేటాయించుకోలేక పోతున్నా! చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినా.. విశ్రాంతి తీసుకోలేక పోతున్నా! ఈ బిజీలైఫ్ కోసమే నేను ఎన్నో ఏళ్లు ఎదురుచూశా! ఫ్యాషన్‌లో ప్రయోగాలు నాకిష్టం. నా లుక్స్‌కు, ఈవెంట్స్‌కు తగ్గట్టుగా కొత్తకొత్త ట్రెండ్స్‌ట్రై చేస్తుంటా! అయితే, ఆ ఫ్యాషన్ డిజాస్టర్ కాకుండా చూసుకుంటా! ఎన్ని వచ్చినా.. చీరకట్టులోనే నేను కంఫర్ట్‌గా ఉంటా! అదే నా ఫేవరేట్ ఫ్యాషన్! సీతారామం, హాయ్ నాన్న.. తర్వాత నన్ను మరిన్ని వైవిధ్యమైన పాత్రల్లో చూడాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. వారిని అలరించడానికి నా మనసుకు దగ్గరైన క్యారెక్టర్లు, సినిమాలు చేయడంపై దృష్టిట్టాను. అలాంటి మంచి కథలు ఎప్పుడైనా, ఎక్కడైనా తలుపు తట్టొచ్చు. రాగానే.. వాటిని వెంటనే అందిపుచ్చుకోవాలి.

## శ్రీలీలతో కంపేరిజన్..
# సీరియస్ అయిన అంజలి!



అంజలి గురించి టాలీవుడ్ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం చేయనక్కర్లేదు. పేరుకు తెలుగమ్మాయే అయినప్పటికీ తెలుగు కంటే తమిళ సినిమాలతోనే ఇక్కడి వారికి దగ్గరైంది. టాలీవుడ్‌లోనూ సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు, గీతాంజలి, వకీల్‌సాబ్ వంటి సినిమాల్లో చెప్పుకోదగ్గ పాత్రల్లో నటించింది. అయినప్పటికీ స్టార్ హీరోయిన్ కాలేకపోయింది. ఆమె తర్వాత వచ్చిన ఎంతోమంది యంగ్ హీరోయిన్లు మాత్రం టాప్‌లో దూసుకెళ్లారు. అంజలి మాత్రమే అక్కడే ఉండిపోయింది. ఇదే విషయమై ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్న అంజలికి కోపం తెప్పించింది. అంజలి కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాల్లో ఒకటి గీతాంజలి. 2014లో వచ్చిన ఈ సినిమాకు ఇప్పుడు సీక్వెల్ రాబోతుంది. దీనికి సంబంధించిన ఫస్ట్ లుక్ తాజాగా రిలీజైంది. ఈ సందర్భంగా మీడియాతో గీతాంజలి మళ్లీ వచ్చింది సినిమా యూనిట్ ఇంటరాక్ట్ అయ్యింది. ఈ సందర్భంగా ఓ రిపోర్టర్ అంజలిని ఓ ప్రశ్న అడిగింది. తాను అంజలికి పెద్ద ఫ్యాన్ అని చెప్పిన సదరు రిపోర్టర్.. తెలుగమ్మాయి కావడం వల్లే సరైనా బ్రేక్ రాలేదని భావిస్తున్నారా? అని ప్రశ్నించింది. దానికి బదులిస్తూ.. నాకు బ్రేక్ రాకపోతే మీరు నాకు అభిమాని ఎలా అయ్యారని రివర్స్ కౌంటరిచ్చింది. తాను తెలుగులోనే కాకుండా తమిళంలో కూడా సినిమాలు చేస్తున్నానని తెలిపింది. అయితే దీనికి మళ్లీ సదరు రిపోర్టర్ స్పందిస్తూ.. శ్రీలీల రేంజ్‌లో సక్సెస్ కాలేదు కదా అంటూ పెళ్లిసందడి బ్యూటీతో పోల్చింది. తనను శ్రీలీలతో పోల్చడంతో అంజలికి చిర్రెత్తుకొచ్చింది. ఇప్పటికీ తాను సినిమాలతో బిజీగానే ఉన్నానని చెప్పింది. అయినా తానెప్పుడు నంబర్స్ గేమ్‌ను పట్టించుకోనని సమాధానమిచ్చింది. టాప్, సెకండ్ అనేవి మన దృష్టి కోణాన్ని బట్టే ఉంటాయని తెలిపింది.

నాకు ఒక హీరోయిన్ నచ్చొచ్చు.. మీకు ఇంకొక హీరోయిన్ నచ్చొచ్చు.. ఈయనకు మరో హీరోయిన్ నచ్చొచ్చు. ఆ ముగ్గురూ ఒక్కరే అవ్వాలన్న రూల్ లేదు. అందుకే ఇది నంబర్ గేమ్ కాదని వివరించింది. తనకు నచ్చిన ప్రాధాన్యం ఉన్న పాత్రలను మాత్రమే చేస్తానని.. అలా లేకపోతే ఆ కథలను ఎంచుకోనని కుండబద్దలు కొట్టింది.

## మహేష్ బాబు ఫ్యాన్స్‌కు బిగ్ అప్‌డేట్..
# నేడే గుంటూరు కారం ట్రైలర్

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం గుంటూరు కారం . శ్రీలీలా, మీనాక్షి చౌదరి కథనాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన లిరికల్ సాంగ్స్ లక్షల వ్యూస్‌తో సోషల్ మీడియాలో ఫుల్ ట్రెండ్ అవుతున్నాయి. ఇక ఈ సినిమా ట్రైలర్‌ను ఎప్పుడు విడుదల చేస్తారా ఎప్పుడెప్పుడు చూద్దామా అంటూ మహేష్ ఫాన్స్ ఆతృతగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. అయితే ఫ్యాన్స్ నిరీక్షణకు తెర దించుతూ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. అయితే ఎప్పుడు విడుదల చేస్తామన్న విషయం మాత్రం వెల్లడించలేదు. మరోవైపు ఈ సినిమా ఓవర్సీస్‌లో భారీ ఎత్తున విడుదల అవుతున్న విషయం తెలిసిందే. ఒక్క అమెరికాలోనే ఈ సినిమాకు సంబంధించి 5 వేలకు పైగా ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు. అయితే ఈ సినిమాకు ఇన్ని షోలు ప్రదర్శించడం పట్ల




ఆర్ఆర్ఆర్ సినిమాపై ఉన్న రికార్డును బద్దలు కొడుతుంది. ఇప్పటివరకు అమెరికాలో అత్యధిక ప్రీమియర్ షోలు ప్రదర్శితం అయిన సినిమాగా (5408 షోలు)రికార్డు క్రియేట్ చేసింది. అయితే ఈ రికార్డును గుంటూరు కారం 5408 షోలతో బద్దలుకొట్టబోతుంది. ఇది ఆల్ టైం రికార్డ్ అంటూ చిత్రబృందం తెలిపింది. ఇక ఈ విషయం తెలుసుకున్న మహేష్ అభిమానులు ఫుల్ ఖుషి అవుతున్నారు.

## జబర్దస్త్ కమెడియన్
# ఇంట్లో విషాదం..
### - బిడ్డను కోల్పోయిన అవినాష్..




జబర్దస్త్ అవినాష్ గురించి పెద్దగా పరిచయం అక్కర్లేదు. జబర్దస్త్ షో ద్వారా వెలుగులోకి వచ్చి షో పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నాడు. ప్రసుత్తం పలు ఈవెంట్స్, సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్నాడు. అయితే అవినాష్ త్వరలోనే మేము తల్లిదండ్రులము కాబోతున్నామంటూ తన భార్య అనూజతో కలిసి దిగిన ఫొటోను ఇన్ స్టాలో షేర్ చేసిని విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు తనకు జరిగిన విషాదాన్నితెలుపుతూ.. తమ బిడ్డని కోల్పోయిన విషయాన్ని పంచుకున్నాడు. తన భార్య అనూజకు అబార్షన్ అయిందని.. తమ బిడ్డను కోల్పోయినట్లు ఇన్ స్టా వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు.నా లైఫ్‌లో సంతోషమైన, బాధ అయినా నా ఫ్యామిలీ అయినా మీతోనే పంచుకుంటాను. ఇప్పటివరకు నా ప్రతి ఆనందాన్ని మీతోనే పంచుకున్నాను. కానీ మొదటిసారి నా జీవితంలో జరిగిన ఒక విషాదాన్ని మీతో పంచుకుందాం అని అనుకుంటున్నాను. మేము అమ్మనాన్న అవ్వాలనే ఆ రోజు కోసం ఎదురు చూసాం. కానీ కొన్ని కారణాల వల్ల మేము మా బిడ్డనీ కొల్పోయాం. ఈ విషయం మేము ఎప్పటికీ జీర్ణించుకోలేనిది. అంత తొందరగ మర్చిపోలేనిది. మీకు ఎప్పటికైనా చెప్పాలీ అన్న బాధ్యతతో ఈ విషయాన్నీ మీతో పంచుకుంటున్నాను. ఇప్పటివరకు మీరు మాపై చూపించిన ప్రేమకీ థాంక్యూ. మీ ప్రేమ ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను. అలాగే దయచేసి ఈ విషయంపై ఎలాంటి ప్రశ్నలు అడిగి మమ్మల్ని బాధ పెట్టవద్దు. మీరందరూ అర్థం చేసుకుంటారని కోరుకుంటూ మీ అనూజ అవినాష్. అంటూ అవినాష్ రాసుకోచ్చాడు.

## శివ కార్తికేయన్ 'అయాలాన్' నుంచి
# థర్డ్ సింగిల్ రిలీజ్





మహావీరుడు సినిమా తర్వాత తమిళ హీరో శివ కార్తికేయన్ నటిస్తున్న తాజా చిత్రం 'అయలాన్' సైన్స్ ఫిక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో మూవీ రానుండగా.. ఆర్.రవికుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్, ట్రైలర్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది.ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ థర్డ్ సింగిల్ విడుదల చేశారు. సురో సురో అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేయగా.. పార్టీ సాంగ్‌లా ఉంది. మోహిత్ చౌహాన్, నకుల్ అభ్యంకర్ కలిసి ఈ పాట పాడగా.. ఆస్కార్ గ్రహీత ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందించాడు. మథన్ కార్కీ లిరిక్స్ రాశారు.సైన్స్ ఫిక్షన్ జానర్‌లో వస్తున్న ఈ సినిమాలో రకుల్ ప్రీత్‌సింగ్ ( కథనాయికగా నటిస్తుండగా.. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. పొంగళ్ 2024 కానుకగా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఇషా కొప్పికర్, శరద్ కేల్కర్, భానుప్రియ, యోగి బాబు, కరుణాకరన్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# మీ ఆర్ట్ పెద్ద అబద్ధం..
## జావేద్ అక్తర్‌పై యానిమల్ టీమ్ విమర్శలు

యానిమల్ సినిమాపై ప్రముఖ బాలీవుడ్ రచయిత జావేద్ అక్తర్ విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. రీసెంట్‌గా ఔరంగాబాద్‌లో ఓ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న జావేద్ అక్తర్ ప్రస్తుత సినిమా పరిస్థితుల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల బ్లాక్ బస్టర్ అందుకున్న యానిమల్ సినిమాను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఇలాంటి సినిమాలు భారీ విజయాన్ని నమోదు చేయడం ప్రమాదకరమని తెలిపాడు. ఈ సినిమాలో ఒక సీన్‌లో హీరో తన ప్రేమను నిరూపించుకోవడానికి హీరోయిన్ ను బూట్లు నాకాలని అడగడం, అలాగే మరోక సీన్లో మహిళలను చెంపదెబ్బ కొట్టడం సరైనదేనని చెప్పడం వంటివి ఉంటాయి. అయితే ఇలాంటి సీన్లు ఉన్నప్పటికీ ఆ సినిమా సూపర్ డూపర్ హిట్ గా మారిందని ఇలాంటి చిత్రాలను ప్రేక్షకులు ఎలా హిట్ చేస్తున్నారో అర్థం కావడం లేదని జావేద్ అక్తర్ అభిప్రాయపడ్డారు. సమాజానికి ఇది ఎంతో ప్రమాదకరం అని ఆయన ఆందోళన చెందారు.

అయితే ఈ వార్తలపై యానిమల్ టీమ్ ఘాటుగా స్పందించింది. జావేద్ అక్తర్‌ను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేసింది. మీలాంటి గొప్ప రైటర్ 'జోయా, రణ్‌వీర్ మధ్య జరిగిన ద్రోహాన్ని అర్థం చేసుకోలేకపోతే మీ కళ అంతా ఒక పెద్ద అబద్ధం. ఒకవేళ ఇదే డైలాగ్ ఒక అమ్మాయి చెప్పివుంటే మీరు దాన్ని ఫెమినిజం పేరుతో సెలబ్రేట్ చేసుకునేవాళ్లు. లింగ భేదమనే రాజకీయాల్లో ప్రేమకు విముక్తి



కల్పించండి. అప్పడే వారిని ప్రేమికులు అంటారు. ప్రియురాలు మోసం చేసి.. అతనికి అబద్ధం చెప్పింది. అందుకే ప్రియుడు షూ నాకమని అన్నాడు' అంటూ రిప్లై ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.



# విజిలెన్స్ ఉద్యోగులకు లక్షల జీతాలు దండగేనా.?

- అవినీతి ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు శూన్యం
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 10 ఏళ్లుగా విచ్చలవిడిగా అవినీతి
- చర్యలు తీసుకోవాల్సిన విజిలెన్స్ మొద్దు నిద్రలో
- విజిలెన్స్ లో ఫిర్యాదులు చేసి విసుగు చెందుతున్న ప్రజలు
- విజిలెన్స్ అధికారులు నిర్లక్ష్యంతో భారీగా పెరిగిన అవినీతి అక్రమాలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో విజిలెన్స్ విభాగం పడకేసింది. మొద్దు నిద్రలో కొనసాగుతోంది. గత రెండుసార్లు అధికారం చెలాయించిన బీఆర్ఎస్ సర్కారు, తొమ్మిదిన్నర ఏళ్లుగా తెలంగాణ స్టేట్ విజిలెన్స్ విభాగాన్ని భ్రష్టు పట్టించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగులపై నిఘా పెట్టకుండా నామమాత్రంగా వ్యవహరించింది. దీంతో అధికారులు నచ్చినంత అవినీతి, దొరికినంత దోపిడీ చేసి పేదలను, ప్రజలను దోచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటు విజిలెన్స్ అధికారులు అవినీతి ప్రభుత్వ ఉద్యోగులపై నిఘా పెట్టి ప్రభుత్వానికి వారి మీద నివేదికలు సమర్పించి చర్యలు తీసుకోవాల్సిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు , మేధావులు, జర్నలిస్టులు, ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు.

## గ్రేటర్ హైదరాబాద్‌లో విజిలెన్స్..

ఇటు బల్దియా పరిధిలోనూ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది.

1. టౌన్ ప్లానింగ్ శాఖ, 2. విద్యుత్ శాఖ
3. రెవెన్యూ శాఖ
4. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ( పురపాలక శాఖ, జీహెచ్.ఎం.సీ)
5. హుడా, 6. హెచ్.ఎం.డీ.ఏ , 7. జలమండలి

తదితర శాఖల్లో అవినీతి , లంచగొండితనం హెచ్చు మీరుతోంది. అయిన విజిలెన్స్ శాఖ అధికారులు ముడుపులకు ఆశపడి ఆయా లంచగొండి అధికారులతో కుమ్మక్కు అవుతున్నారు. ఫలితంగా లంచం రూపంగా లక్షలు సంపాదిస్తున్నారు. ఇన్ని తెలిసినా విజిలెన్స్ శాఖ అధికారులు తీసుకుంటున్న జీతాలకు మాత్రం నిజాయితీగా ప్రజల పక్షాన, ప్రభుత్వం లక్ష్యం కోసం పని చేయకుండా లంచాలకు పరిగెత్తి ప్రభుత్వ నియమ నిబంధాలను గాలికి వదిలేయడం బాధాకరం.

## ప్రజా సర్కార్ ప్రక్షాళన చేసేనా.?

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కొలువు దీరిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ మీద చర్యలు తీసుకోవాలని భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను సస్పెండ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. తాము ఏ ప్రభుత్వ విభాగాన్ని ఆశ్రయించినా లంచాలతో విసుగెత్తేలా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విజిలెన్స్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాలని ముక్త కంఠంతో మేధావులు , ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అలాగే అన్ని శాఖల అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలని ప్రభుత్వానికి సూచిస్తున్నారు.




## విజిలెన్స్ డైరెక్టర్, కమిషనర్లు చర్యలు తీసుకుంటారో లేరో..

ఇటీవలే ఐపిఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా సీనియర్ పోలీస్ అధికారి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ జనరల్ గా బదిలీ అయ్యారు. దీంతో విజిలెన్స్ శాఖకు ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ పరిధితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయి డిజీ అధికారి ఉండటంతో ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క లక్ష్యాలకు అనుగుణంగా ఈ కొత్త అధికారులు పని చేసి ప్రజలతో పాటు ప్రభుత్వం ఆశయాలను నిలబెడతారో లేదోనని ప్రజలు ఆలోచిస్తున్నారు. సర్కారు ఆలోచనలకు అనుగుణంగా విజిలెన్స్ కొత్త డీజి, జిహెచ్ఎంసి విజిలెన్స్ డైరెక్టర్ విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన విజిలెన్స్ అధికారులపై , అటు అవినీతి ప్రభుత్వ ఉద్యోగులపై కొరడా ఝులిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆంధ్రా కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే కాళేశ్వరం నిర్మాణం: కోదండరాం



**హైదరాబద్ (ప్రశ్న న్యూస్):** 'ఎక్కడ పైసలు సప్పుడు చేస్తయో.. అక్కడ జ్ఞానం పని చేయదు' అనేది ఎనుకటి సామెతని, కాళేశ్వరం విషయంలో కేసీఆర్ తీరుకు ఇదే నిదర్శనంగా నిలిచిందని టీజేఎస్ చీఫ్ ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. ఆంధ్రా కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే మాజీ సీఎం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని ఆరోపించారు. దీనికోసం ప్రాణహిత – చేవెళ్ల లిఫ్ట్ స్కీమ్ ను రీడిజైన్ చేశారని మండిపడ్డారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి తక్కువ ఖర్చుతో నీటిని తెచ్చుకునే మార్గం ఉన్నప్పటికీ గత ప్రభుత్వం దానిని ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టిందని చెప్పారు. దీని స్థానంలో గోదావరి – కృష్ణా లింక్ ప్రాజెక్టును కేసీఆర్ తెరపైకి తెచ్చారని విమర్శించారు. కేసీఆర్ మూడోసారి గెలిస్తే రెండు ప్రధాన నదుల కింద ఆయకట్టు ధ్వంసమయ్యేదని, రైతులు ఆగమయ్యేవారని చెప్పారు. కొంతమంది కాంట్రాక్టర్లు, కొన్ని పైపుల కంపెనీలు మాత్రమే బాగుపడేవని తెలిపారు. అయితే, ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి తెలంగాణను ఆ ప్రమాదం నుంచి తప్పించారని ప్రశంసించారు. కాళేశ్వరం లోపాలపై తెలంగాణ ఇంజనీర్స్ ఫోరం కన్వీనర్ దొంతుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. కాళేశ్వరంలోని లోపాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదాలను ముందే ఊహించి ఇంజనీర్లు హెచ్చరించినా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం రికార్డుల కోసమే పనిచేసింది తప్ప ప్రాజెక్టులు పది కాలాలు మన్నికగా ఉండాలనే ఆలోచన చేయలేదన్నారు. రైతులకు దీర్ఘకాలం పాటు ఉపయోగపడాలనే లక్ష్యం, చిత్తశుద్ధి గత ప్రభుత్వానికి లోపించిందని విమర్శించారు. ఎగువన ఉన్న నదుల నుంచి దిగువ ప్రాంతాలకు కాల్వల ద్వారా నీళ్లు ఇవ్వడమే సరైన విధానమని, దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఉంటుందని కోదండరాం చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని నిపుణులు రూపొందించిన ప్రాణహిత ప్రాజెక్టును పక్కన పెట్టిన కేసీఆర్.. భారీ ఖర్చుతో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. మల్లన్నసాగర్ తోనూ భవిష్యత్లో ప్రమాదాలు ఎదురవుతాయని కోదండరాం తెలిపారు. ఇది కాళేశ్వరం అక్రమాలను బయట పెట్టే ప్రజెంటేషన్ మాత్రమే కాదని, అవినీతితో అక్రమంగా కూడబెట్టిన కోట్లాది రూపాయలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూస్తున్న వారిని జుట్టుపట్టి ఈడ్చుకొచ్చే ప్రయత్నమని కోదండరాం చెప్పారు.

### ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చేస్తారా?

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు ఎన్నుకున్నారని ప్రొఫెసర్ కోదండరాం చెప్పారు. అయితే, బీఆర్ఎస్ నాయకులు మాత్రం ప్రజల తీర్పును స్వీకరించేందుకు సిద్ధంగా లేరన్నారు. ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదని సీనియర్ నేతలు వ్యాఖ్యానించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చేస్తారా అని నిలదీశారు. 'తమ దగ్గర పైసలు ఉన్నాయి కాబట్టి తమదే రాజ్యం అనే ఆలోచనలో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను కూల్చుతామనడం ఆహ్వానించదగ్గ పరిణామం కాదు. ఇలాంటి రాజకీయాలు పోవాలి' అని ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు.

# కార్గిల్ కొండల్లో సత్తా చాటిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** పర్వత ప్రాంతాల్లో యుద్ధం చేయడంలో ఆరితేరిన భారత వాయుసేన (ఇండియన్ ఎయిర్ ఫోర్స్) ఇప్పుడు కొత్త సామర్థ్యాన్ని సంతరిచుకుంది. అత్యంత కఠినమైన వాతావరణం ఉండే కార్గిల్ పర్వత ప్రాంతాల్లో రాత్రివేళ భారీ రవాణా విమానాన్ని ల్యాండింగ్ చేసింది. ఇక్కడి చిన్న రన్ వేపై సి-130జే విమానాన్ని విజయవంతంగా ల్యాండింగ్ చేసింది. హిమాలయ పర్వత సానువుల్లో సాధారణంగా పగటిపూట కూడా వాతావరణం ఏమాత్రం అనుకూలించదు. అలాంటిది, రాత్రివేళ ఒక భారీ విమానాన్ని ల్యాండింగ్ చేయడం పైలెట్ల నైపుణ్యానికి, తెగువకు పరీక్ష అని చెప్పాలి. ఇప్పుడీ ఘనతను భారత వాయుసేన పైలెట్లు సాధించారు. గరుడ్ కమాండో ట్రైనింగ్ లో భాగంగా ఈ నైట్ ల్యాండింగ్ చేపట్టారు. ఇటీవల ఉత్తరాఖండ్ లో కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయిన సందర్భంగా కూడా సీ-130జే రవాణా విమానాలను భారత వాయుసేన స్థానిక ఎయిర్ స్ట్రిప్ పై ల్యాండింగ్ చేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం ఈ కార్గో విమానాలు సేవలు అందించగలవు.

## ప్రధాని మోదీ మెచ్చుకున్న రామ భక్తి గీతం




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** అయోధ్య రామాలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠకు ముహూర్తం సమీపిస్తున్నది.. దేశవిదేశాలలోని రామ భక్తులు ఆ క్షణం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాముడికి స్వాగతం పలుకుతూ పలువురు గీతాలు, భజనలు రూపొందిస్తూ భక్తిని చాటుకుంటున్నారని చెప్పారు. వాటిలో తనకు నచ్చిన గీతాలను ప్రధాని మోదీ ట్వీట్టర్ ద్వారా పంచుకుంటూ గాయకులను మెచ్చుకుంటున్నారు. తాజాగా గుజరాతీ గాయని గీతా రబారీ పాడిన పాటను ట్వీట్ చేస్తూ.. ఈ పాట భావోద్వేగంగా ఉందంటూ మోదీ కామెంట్ చేశారు. గుజరాత్ కు చెందిన గీతా రబారీ జానపద గాయని. అయోధ్య రాముడిపై తాజాగా ఓ భక్తి గీతాన్ని రూపొందించి సోషల్ మీడియాలో విడుదల చేశారు. 'మేరా రామ్ ప్రభూ జీ ఘర్ ఆయే..' అంటూ సాగే ఈ పాటను విన్న ప్రధాని.. గీతా రబారీని మెచ్చుకున్నారు. ఈ వీడియోను షేర్ చేస్తూ రాముడికి స్వాగతం పలుకుతూ సాగిన గీతం భావోద్వేగం కలిగించిందని మోదీ ట్వీట్ చేశారు.

# టౌన్ ప్లానింగ్‌లో అబద్ధాల అధికారులు

**- జిహెచ్ఎంసిలో ఫిర్యాదులపై పూర్తిగా స్పందన కరువు**

- ఫిర్యాదుదారులను తప్పుదోవ పట్టిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు
- గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేస్తే సమస్య తీర్చకుండానే ప్రాబ్లం సాల్వ్ అంటూ తప్పుడు మెసేజ్లు
- ఫిర్యాదులపై చర్యలు లేకుండానే సాల్వ్డు అంటూ ఫిర్యాదును క్లోజ్ చేస్తున్న అవినీతి అధికారులు
- లంచాలు తీసుకొని భారీ అక్రమ ఫంక్షన్ హాల్ షెడ్ నిర్మాణంను ప్రోత్సహిస్తున్న అధికారులు
- లంచాలే పరమ అవధిగా డ్యూటీ చేస్తున్న కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి
- ఫిర్యాదుల పై స్పందించని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ




CP-GHMCHY DELETE
the inconvenience caused. Your issue will be resolved shortly.Ref ID : 2012234212400 - GHMC
Dear Citizen, Your Grievance ID: 2012234212400 on Unauthorized Construction is re-solved. You are requested to kindly check and provide feedback using below link: https://igs.ghmc.gov.in/Citizenfeedback.aspx?compId=2012234212400 - GHMC
Grievance Status



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాప్రా సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు అబద్ధాలకు మారుపేరుగా మారారు. నగరంలో జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాలపై ప్రజలు స్వచ్ఛందంగా స్పందించి జిహెచ్ఎంసి గ్రీవెన్స్ లో ఫిర్యాదులు చేస్తే వాటిపై చర్యలు తీసుకోకుండా ప్రాబ్లం సాల్వ్ అంటూ తప్పుడు మెసేజ్లు ఇస్తూ సమస్యను తీర్చకుండానే ఫిర్యాదును ముగించేస్తున్నారు. ముందుగానే టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులతో మామూళ్లకు లాలూచీపడి ఫిర్యాదులు చేసిన వాటిని పట్టించుకోకపోవడం వాళ్ల అవినీతికి నిదర్శంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా సీకే గార్డెన్ భారీ అక్రమ ఫంక్షన్ హాల్ షెడ్ నిర్మాణం చేయడంతో స్థానికులు ఆన్లైన్లో జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే మామూళ్ల ఒప్పందాలతో అమ్ముడుపోయిన అధికారులు నోటీసులు ఇవ్వకుండా షెడ్డును కూల్చి వేయకుండా ప్రాబ్లం సాల్వ్ అంటూ ఫిర్యాదుదారులకు మెసేజ్ చేయడం, ఫిర్యాదుని క్లోజ్ చేయడం చాలా అవినీతితో కూడుకున్న అక్రమమని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో జిహెచ్ఎంసి అధికారుల అవినీతిని పెంచి పోషించారని అదే ముసుగులో ఇప్పుడు కూడా కొంతమంది అధికారులు ఇలా అవినీతికి పాల్పడుతున్నారని ఫిర్యాదు దారిని తప్పుదోవ పట్టించిన కాప్రా సర్కిల్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ కు ఫిర్యాదు చేస్తున్నారు.

### బాధ్యతారాహిత్యంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్..

కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ షెడ్ల నిర్మాణాలపై జోనల్ కమిషనర్ పంకజ కు ఫిర్యాదులు చేసిన అసలు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అవినీతి అక్రమాలపై స్థానికులు జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన స్పందించిన దాఖలాలు లేవని అంటే జోనల్ కమిషనర్ ప్రజల ఫిర్యాదులను స్వీకరించరా.? వాటిని పరిష్కరించరా.? అవినీతి ఆక్రమాలే జోనల్ కమిషనర్ పంకజ లక్షమా.? ఇంత భారీ ఫంక్షన్ హాల్ షెడ్ నిర్మాణం చేస్తుంటే జోనల్ కమిషనర్ స్పందించకపోవడం వెనక ఆమెకు హస్తం ఉందా.? అన్న అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఉన్నత అధికారులు కూడా అవినీతి, అక్రమాలను ప్రోత్సహించడం, బాధ్యతారాహిత్యం వహిస్తున్న జోనల్ సిపి, సర్కిల్ ఏసిపి పై చర్యలు తీసుకోకపోవడం వెనక ఆర్థిక లావాదేవీలే కారణమన్న అనుమానం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ స్పందించి ఇంత భారీ అక్రమ షెడ్ వెంటనే కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588